4 పేజీలు 7 నయా పైసలు ANDHRA JAN ATHA 200176 HYDERABAD REGD. NO. H. 634

ఆంధ్రజనత

హైద్రాబాద్, ఆదివారం 5-12-1959 సంపాదకుడు: కె. యస్. సుబ్రహ్మణ్యం సంపుటి 5 సంచిక 161

వివాహం అంటే ఏమిటి?

న్యూఢిల్లీ, డిసెంబర్ 4

వివాహం ఒప్పందమా లేక సంస్కారమా? ఈ రోజున లోక్ సభలో శ్రీ హిరేమఠ్ బారువా (పి. ఎస్. పి.) ఈ ప్రశ్న వేసి దానికి తానే సమాధానమిచ్చారు. హిందూ సమాజం వివాహాన్ని సంస్కారంగా పరిగణిస్తున్నది. అయితే పూర్వీకుల ఈ నిర్వచనం ఎంత వరకు సఫలమైందో తనకు తెలియదని ఆయన అన్నారు. "వివాహం అంటే యవ్వనంలో ఉన్న ఒక వ్యక్తి ఒక ముసలి వాని కూతురును పోషించే బాధ్యత పైన వేసుకొంటూ కుదుర్చుకునే ఒక తెలివితక్కువ ఒడంబడిక. దీనిలో కొంత అర్థశాస్త్రం కూడా ఉన్నది." అని ఆయన నిర్వచించారు. వరకట్న నిషేధం బిల్లుపై చర్చ సందర్భంలో ఆయన అలా అన్నారు.

హైద్రాబాద్‌లో 60 సంవత్సరాలు నుండి
ప్రఖ్యాతి గాంచిన షోరూమ్
హార్డి అండ్ కో
124, మహాత్మా గాంధీ రోడ్, సికింద్రాబాద్, ఫోన్ నెం: 7118.
60 సంవత్సరాల నుంచి మీ సేవ చేస్తున్న మా సుప్రసిద్ధ నేత్ర వైద్యులచే మీ దృష్టిని పరీక్ష చేయించుకొనండి. అమెరికా ఫ్రేములతో తయారైన కంట్లకళ్లద్దాలు ధరించండి. డాక్టర్ల సలహాలు జాగ్రత్తగా పరిశీలించబడును. సమంజసమైన ధరలు.
[Khan & Sons]

ప్రపంచ రాజ్యాల మధ్య సుహృద్భావ సాధనకు కృషి

విదేశ పర్యటన లక్ష్యంపై ఐసెన్‌హోవర్ ప్రకటన

మొరాకో నుంచి ఢిల్లీ వరకు యాత్ర ప్రారంభం

వాషింగ్టన్, డిసెంబర్ 4

సుహృద్భావ సందేశంతో 11 ఆసియా, యూరప్ రాజ్యాలలో అమెరికా అధ్యక్షుడు తలపెట్టిన పర్యటన కార్యక్రమం నేడు ఆయన ప్రత్యేక విమానంలో బయలు దేరటంతో ప్రారంభమైనది.

అమెరికా అధ్యక్షుని జెట్ విమానం సెంట్ ఆండ్రూస్ సైనిక విమానాశ్రయం నుంచి భారతీయ కాలమానం ప్రకారం 4వ తేదీ ఉదయం 6-41 గంటలకు (అమెరికా కాలమానం ప్రకారం 3వ తేదీ రాత్రి 8-11 గంటలు) బయల్దేరినది.

అధ్యక్షుని పర్యటన బృందంలో మేజర్ ఐసెన్‌హోవర్ దంపతులు కూడా ఉన్నారు.

9 రోజులు పట్టే ఇంత సుదీర్ఘమైన యాత్రను ఇంతకు పూర్వపు అమెరికా అధ్యక్షులలో ఎవరూ చేసి ఉండలేదు. మొరాకో నుంచి ఢిల్లీ వరకూ పర్యటనలు జరిపిన అనంతరం అధ్యక్షుడు 19 నుంచి 21 వరకు పారిస్‌లో జరగబోయే పశ్చిమ రాజ్యాల శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు.

అమెరికా ప్రజలకు సందేశం

తన యాత్రను ప్రారంభించడానికి ఒక గంట ముందు అధ్యక్షుడు టెలివిజన్‌లో మాట్లాడుతూ ప్రపంచంలోని ఉద్రిక్త పరిస్థితిని తొలగించడానికి అమెరికా ప్రజలకు గల తీవ్ర ఆకాంక్షను అందరికీ తెలియజేయగలనని అన్నారు. తన పర్యటనలో అమెరికాను ఇతర దేశాల వారు ఎక్కువగా అర్థం చేసుకొనేటట్లు కృషి చేయగలననీ, మిత్ర రాజ్యాలను గురించి అధికంగా అర్థం చేసుకొనడానికి ప్రయత్నించ గలననీ ఆయన అన్నారు.

అమెరికా లక్ష్యం

సంపదను గౌరవించి భౌతిక విషయాలకే అమెరికా ప్రాధాన్యత నిస్తుందని అమెరికాను కొందరు అన్యాయంగా విమర్శిస్తున్నారనీ, "ప్రపంచంలో ఎక్కడా ఒక్క అంగుళం మేర అయినా ఆక్రమించాలని గానీ, స్వలాభం కోసం ప్రయత్నించాలని గానీ, అన్యాయంగా లాభం పొందాలని గానీ" అమెరికా భావించడం లేదని అధ్యక్షుడు స్పష్టం చేశారు.

అమెరికా తన స్వదేశంలోనూ, ఇతర దేశాలలోను కూడా ప్రజలు సంతోషంగా జీవించాలనే కోరుతున్నదని ఆయన అన్నారు.

కొన్ని విషయాలలో అమెరికా మూల పురుషులు నిర్దేశించిన ఆదర్శాలను అమెరికా మన్నించని సంఘటనలు అప్పుడప్పుడు జరిగాయనీ, అయితే ఆ మూల పురుషులు నిర్దుష్టం చేసిన ధ్యేయాన్ని చేరుకొనడానికి అమెరికా సర్వదా ప్రయత్నించడమే దాని గొప్పతనమని ఆయన అన్నారు.

అమెరికా ప్రజల నైతిక విశ్వాసాలకు ప్రజలు తమను తిరిగి అంకితం చేసుకోనాలనీ, తమ లోపాలను, చరిత్రను ఈ విశ్వాసాల దృష్ట్యా పునః పరిశీలించుకొనాలని ఆయన అమెరికా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

హెర్టర్‌తో సమాలోచనలు

వాషింగ్టన్, డిసెంబర్ 3

నేటి రాత్రి ప్రయాణాన్ని ప్రారంభించనున్న అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ విదేశాంగ శాఖ కార్యదర్శి క్రిస్టియన్ హెర్టర్‌తో సమాలోచనలు జరిపారు. తన పర్యటనలో ప్రస్తావనకు వచ్చే అవకాశమున్న విదేశాంగ సమస్యలను గురించి వారిద్దరూ సంభాషణలు జరిపారు. తన పర్యటన ప్రారంభం కావడానికి కొద్ది నిముషాల ముందు అమెరికా ప్రజలకు ఇవ్వనున్న టెలివిజన్ సందేశానికి తుది మెరుగులు ఈ సంభాషణలలో దిద్ద బడ్డాయి.

ఎర్నాకులం, డిసెంబర్ 4

ఆంధ్రప్రదేశ్ హైకోర్టునుంచి కేరళ హైకోర్టుకు బదిలీ చేయబడిన శ్రీ మహమ్మద్ అన్సారీ నేడు పదవీ బాధ్యతలు స్వీకరించారు.

రోమ్ ఆగమనం

రోమ్, డిసెంబర్ 4

వరకొండు ఆసియా, ఆఫ్రికా, యూరప్ దేశాలలో చరిత్రాత్మకమైన పర్యటన జరపటానికి బయల్దేరిన అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ నేడు ఇక్కడికి చేరుకున్నారు.

వర్షం, పొగమంచు కారణంగా ఐసెన్‌హోవర్ విమానం రోమ్ విమానాశ్రయంలో దిగేముందు కొంతసేపు పైననే తిరుగుతూ ఉండవలసివచ్చింది.

యూరప్‌లోని విమానాశ్రయాలలో రద్దీ చాలా అధికంగా ఉండే రోమ్ విమానాశ్రయంలో ఐసెన్‌హోవర్ రాక సందర్భంగా కఠినమైన భద్రత ఏర్పాట్లు చేయబడ్డాయి. విమానాశ్రయంలోకి ఎవ్వరినీ రానివ్వలేదు. విమానాశ్రయంనుంచి విడిది వరకు 12 మైళ్ల దారిని నాలుగు వేలమంది పోలీసులు కాపలా కాస్తూ నిల్చున్నారు.

లడక్‌లో ప్రథమ విద్యుదుత్పత్తి కేంద్రం

వచ్చే ఏప్రిల్‌లో ప్రారంభం

శ్రీనగర్, డిసెంబర్ 3

లడక్‌లో ప్రథమంగా నిర్మిస్తున్న విద్యుదుత్పత్తి కేంద్రం వచ్చే మార్చి, ఏప్రిల్ నెలలలో పని ప్రారంభించ గలదని లడక్ అభివృద్ధి శాఖ డిప్యూటీ కమీషనర్ కర్నల్ కె. ఎ. రాజా నేడిక్కడ వెల్లడించారు. లే ప్రాంతంలో నిర్మించబడుతున్న ఈ కేంద్రం 100, 150 కిలోవాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయగలదని, దీనికి 3,4 లక్షల రూపాయలు ఖర్చుకాగలదని ఆయనఅన్నారు. ఇంగాంగ్లస్ అనే గ్రామంలోని ప్రజలు మంచు కరిగి ప్రవహించే నీటికి ఒక ఆనకట్టనుకట్టి, ఆ నీటిని వ్యవసాయానికి వినియోగించాలని కృషి చేస్తున్నారనీ, ప్రభుత్వోద్యోగులు ఈ నిర్మాణం బాధ్యత వహిస్తే ప్రభుత్వానికి 20 వేలు ఖర్చు కాగలదనీ ఆయన అన్నారు.

నికోషియా, డిసెంబర్ 3

సైప్రస్ రిపబ్లిక్ ఉపాధ్యక్షుడుగా టర్కిష్ జాతీయుడు ఫదిల్ కుబుల్ ఎన్నికైనట్లు నేడు ప్రకటించబడింది.

అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనము
హైదరాబాద్
1960 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు
ప్రకటన
ఎగ్జిబిషన్ జరిగే కాలంలో, శాకాహార, మాంసాహార హోటల్సుకు; తలాన్ ఘర్‌లకు, ఐస్‌క్రీమ్, కోల్డ్ డ్రింక్ బూత్‌లకు, పాన్ షాపులకు, సైకిలు స్టాండులకు స్థలాలు ఎగ్జిబిషన్ ఆఫీసువద్ద వేలం వేయబడును.

వ. నెం.	స్థలం	బయానా మొత్తం	దరఖాస్తులకు ఆఖరు తేదీ	వేలం రోజు
1.	శాకాహార, మాంసాహార హోటల్సు	రు. 1,500	11-12-59 సా॥5	12-12-59 సా॥4గం.
2.	తలాన్ ఘర్ నెం. 1, 2	రు. 1,000	11-12-59 ,,	12-12-59 ,,
3.	ఇతర తలాన్ ఘర్లు	రు. 150	11-12-59 ,,	12-12-59 ,,
4.	ఐస్‌క్రీమ్, కోల్డ్ డ్రింక్ బూత్‌లు	రు. 200	12-12-59 ,,	13-12-59 ,,
5.	పాన్ షాపులు	రు. 50	12-12-59 ,,	13-12-59 ,,
6.	సైకిలు స్టాండు	రు. 1,000	12-12-59 ,,	13-12-59 ,,

1. బయానా మొత్తాన్ని ఎగ్జిబిషన్ కార్యాలయంలో వేలం ఆరంభమవడానికి కనీసం 2 గంటలకు ముందుగా చైనా చెల్లించాలి.
2. వేలం పాటలో నెగ్గినవారు పూర్తి మొత్తాన్ని అక్కడికక్కడే చెల్లించాలి. ఆ విధంగా చేయనిచో, స్థలాలను తిరిగి వేలం వేయడమే గాకుండా, ఎగ్జిబిషన్ సొసైటీకి తిరిగి వేలం వేయడం వల్ల నష్టం ఏమైనా వస్తే, దానికి వారినే బాధ్యులను చేయుదురు. వేలం షరతులు, నిబంధనలు ఎగ్జిబిషన్ సొసైటీ నుంచి తెలుసుకొనవచ్చును.

ఫోన్: 4553 గౌ॥ కార్యదర్శి

రెవెన్యూ మంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డి మంగళవారం నాడు హైద్రాబాద్ జిల్లా పరిషత్తుకు ప్రారంభోత్సవం చేసిన దృశ్యం. ఆయన కుడి వైపున కూర్చున్నవారు జిల్లా పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీ సర్సయ్య.

పక్షపాతంలేని ట్రంక్ కాల్స్!

న్యూఢిల్లీ, డిసెంబర్ 3

టెలిఫోన్ ట్రంక్ కాల్స్ విషయంలో జరుగుతున్న జాప్యం యొక్క ఫలితాన్ని అందరివలె తను కూడా తరుచు అనుభవిస్తున్నట్లు కేంద్ర మంత్రి డాక్టర్ సుబ్బారాయన్ నేడు లోక్ సభలో వెల్లడించారు.

తాము ఎప్పుడు ట్రంక్ కాల్ చేసినా, పేరు చెప్పకుండా, టెలిఫోన్ నెంబర్ మాత్రమే చెబుతూండటంవల్ల అందరివలె తనకూ ఈ బాధ తప్పడం లేదని ఆయన అన్నారు.

ఆదాయం పెరుగుదలతో పాటు పనిలో చురుకుదనం గూడా పెంచే విషయం ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలన్న సూచనను మంత్రి కూడా అంగీకరించారు.

టెలిఫోన్ ఆపరేటర్లు మర్యాదగా ప్రవర్తించడం కూడా అలవరచుకోవాలని ఆయన అన్నారు.

గ్రామరాజ్యస్థాపనకు దారితీసే పథకం

జిల్లా పరిషత్తులను విజయవంతం చేయాలని

పరంగల్‌లో మంత్రి రంగారెడ్డి ఉద్బోధ

వరంగల్, డిసెంబర్ 4

ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా అమలు పరచబడిన వికేంద్రీకృత పరిపాలనా వ్యవస్థను విజయవంతంగా నిర్వహించినట్టయితే గాంధీజీ ఆశించిన గ్రామ రాజ్య స్థాపనకు మార్గం ఏర్పడ గలదని రాష్ట్ర రెవెన్యూ మంత్రి శ్రీ కొండా వెంకటరంగారెడ్డి అన్నారు.

నిన్న సాయంకాలం వరంగల్ జిల్లా పరిషత్తుకు ప్రారంభోత్సవం సందర్భంలో ప్రసంగిస్తూ శ్రీ రంగారెడ్డి అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలుపరచే విషయంలో ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా ఉన్నదని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలనను వికేంద్రీకరించే ఈ పథకాన్ని కూడా విజయవంతంగా అమలు పరచిన మన రాష్ట్రం ఈ విషయంలో కూడా ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయం కాగలదని ఆయన ఆశాభావాన్ని ప్రకటించారు.

పరిషత్తుకు ప్రారంభోత్సవం చేసిన రాష్ట్ర సహకార మంత్రి శ్రీ మెహిదీ నవాజ్ జంగ్ ఈ పథకాన్ని విజయవంతం చేయటానికి అధికార, అనధికార సభ్యులు పరస్పర సహకారంతో పని చేయాలని ఉద్బోధించారు.

శాసన సభ్యులు, పరిషత్తుఅధ్యక్షుడు శ్రీ వెంకట్రామ నరసయ్య మంత్రులకు స్వాగతం చెప్పారు. జిల్లాకలెక్టర్, ప్రదేశ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీ నూకల రామచంద్రారెడ్డి కూడా ప్రసంగించారు. పరిషత్తు ఉపాధ్యక్షుడు ధర్మారెడ్డి కృతజ్ఞతాభివందనం చేశారు.

హెచ్. ఎస్. సి. పరీక్షా ఫలితాలు

గత అక్టోబర్ నెలలో జరిగిన హెచ్. ఎస్. సి. అనుబంధ పరీక్షా ఫలితాలు ఆదివారం (డిసెంబర్ 6) దిన పత్రికలలో ప్రచురింప బడతాయి.

బి.ఇ. ఫలితాలు

ఉస్మానియా యూనివర్శిటీ బి.ఇ. పరీక్షా ఫలితాలు ఆరవ పేజీలో ప్రచురింప బడినవి.

లడక్ సరిహద్దు సమస్యపై ఇండియా-చైనా సర్దుబాట్లు

పాకిస్తాన్ గుర్తించదని భద్రతా మండలికి లేఖ

న్యూయార్క్, డిసెంబర్ 4

జమ్మూ — కాశ్మీర్‌లో అంతర్భాగమైన లడక్ సరిహద్దుల సమస్యపై ఇండియా, చైనాలు ఏ విధమైన సర్దుబాట్లను చేస్తే వానిని తాను అంగీకరించ జాలనని పాకిస్తాన్ భద్రతా మండలి అధ్యక్షునికి నేడొక లేఖ వ్రాసింది.

ఈ లేఖను సమితిలో పాకిస్తాన్ శాశ్వత ప్రతినిధి ప్రిన్స్ ఆలీఖాన్ నేడు అధ్యక్షునికి అందజేశారు. ఈ లేఖలో ఇంతవరకు కాశ్మీర్ సమస్యపై సమితిలో జరిగిన చర్చలను సమీక్షించి, కాశ్మీర్ భావిష్యత్తు స్వేచ్ఛాయుత వాతావరణంలో కాశ్మీర్ ప్రజలే నిర్ణయించుకోవాలని సమితి తీర్మానించిందని ఆయన వివరించారు.

అటువంటి ఏర్పాట్లు జరిగి, కాశ్మీర్ భవిష్యత్తు నిర్ణయించబడే వరకూ ఆ ప్రాంతపు అంతర్జాతీయ సరిహద్దులను కాపాడవలసిన బాధ్యత భద్రతా సంఘంపై ఉందని ఈ లేఖలో పాకిస్తాన్ వివరించింది. ప్రస్తుతం ఇండియా-చైనా సరిహద్దు సమస్యలో లడక్‌కు సంబంధించినంత వరకు తన బాధ్యతను భద్రతా సంఘం నిర్దుష్టంగా గుర్తించాలని పాకిస్తాన్ అభ్యర్థించింది.

లడక్ విషయాన్ని వివరించే పూర్వ చరిత్ర గల పత్రాన్ని పాకిస్తాన్ అన్ని దేశాల ప్రతినిధి వరాలకు సంపింది.

భారత ప్రతినిధి ఖండన

న్యూయార్క్, డిసెంబర్ 4

లడక్ విషయంలో భద్రతా సమితికి పాకిస్తాన్ లేఖను వ్రాసిన వెంటనే భారత ప్రతినిధివర్గ సభ్యుడు ఒకరు మాట్లాడుతూ పాకిస్తాన్ వాదాన్ని ఖండించారు.

కాశ్మీర్ ఇండియాలో చేరిపోయినందువల్ల లడక్ ఇండియాలో నిస్సందేహమైన అతర్భాగమని ఆయన స్పష్టం చేశారు. కాశ్మీర్ పై ఇండియా ఆధిపత్యాన్ని 1948 ఆగస్టు 13వ తేదీని చేసిన తీర్మానంలో ఐక్యరాజ్య సమితి కాశ్మీర్ సంఘం గుర్తించినదని కూడా ఆయన స్పష్టం చేశారు. అందువల్ల లడక్, చైనాల మధ్య సరిహద్దులను రక్షించవలసిన పవిత్ర బాధ్యత భారత దేశంపై ఉందని ఆయన వివరించారు.

ప్రస్తుతం ఇండియా సరిహద్దు సంఘ

(మిగతా 4వ పేజీలో)

ఆహార ధరలు పెరుగుదలకు నిరసన

మంగుళూరులో 12 వేల మంది కార్మికుల సమ్మె

మంగుళూరు, డిసెంబర్ 4

అత్యవసర వస్తువుల ధరలు "అసాధారణంగా" పెరిగిపోయిన కారణంగా ప్రజలు పడుతున్న అవస్థల పట్ల ప్రభుత్వ దృష్టి కేంద్రీకరించటానికి, ధరలను అదుపులో పెట్టడానికి తగు చర్యలు గైకొనే అవసరాన్ని ప్రభుత్వానికి తెలియ పరచడానికి పట్టణంలోని 20,000 మంది కార్మికులలో సుమారు 12,000 మంది నేడు పనిమానేసి సమ్మె చేశారు.

న్యూయార్క్ పత్తి

న్యూయార్క్, డిసెంబర్ 4

నిన్నటి ముగింపు ధర	32.97
నేటి ప్రారంభ ధర	33.00

రెండవ శ్వేత పత్రంపై రాజ్యసభ చర్చ

న్యూఢిల్లీ, డిసెంబర్ 4

చైనా, ఇండియా సరిహద్దు వివాదానికి సంబంధించి భారత ప్రభుత్వం ప్రచురించిన రెండవ శ్వేత పత్రంపై రాజ్యసభ డిసెంబర్ 8వ తేదీ నాడు చర్చ జరుపుతుంది. ప్రధాన మంత్రి తీర్మానం ప్రతిపాదించటంతో చర్చ ప్రారంభమౌతుంది. మర్నాడు ప్రధాని చర్చకు సమాధానమిస్తారు.

నేపాల్ రాజకీయ సమస్యలు

నేడే ప్రధాని కోయిరాలా ప్రకటన

ఖాట్మాండు, డిసెంబర్ 4

నేపాల్‌ను ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గురించిన ఒక ముఖ్యమైన ప్రకటనను ఒక బహిరంగ సభలో నేపాల్ ప్రధాని కోయిరాలా ఈ నెల 6వ తేదీని చేయగలరని తెలుస్తున్నది. నేపాల్‌పై దురాక్రమణ జరిగితే దానిని భారత దేశంపై జరిగిన దురాక్రమణగానే భావించగలమని ప్రధాని నెహ్రూ లోక్ సభలో చేసిన ప్రకటన దృష్ట్యా కోయిరాలా ప్రకటనకు ఎక్కువ ప్రాధాన్యత ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రధాని నెహ్రూ ప్రకటనకు సంబంధించి తన ప్రభుత్వపు వైఖరిని ఈ ప్రకటనలో శ్రీ కోయిరాలా ప్రస్తావించే విషయం ఇంకా స్పష్టం కాలేదు.

కల్నల్ నాసర్ భారత పర్యటన వాయిదా

కైరో, డిసెంబర్ 4

వచ్చే నెలలో ఇండియాకు రావలసిన ఐక్య అరబ్ రిపబ్లిక్ అధ్యక్షుడు కల్నల్ నాసర్ తమ పర్యటనను నిరవధికంగా వాయిదా వేసుకొన్నట్టు అధికార వర్గాల ద్వారా నేడిక్కడ తెలిసినది.

గజపతిరావు నాయుడు విడుదల

ఇంజనీర్ భార్య హత్యకేసులో జడ్జి తీర్పు

మచిలీపట్టణం, డిసెంబర్ 4

కమలమ్మ హత్య కేసులో నిందితుడైన విజయవాడ విద్యుచ్ఛక్తి శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీ బి. గజపతిరావు నాయుడును కృష్ణా జిల్లా సెషన్స్ జడ్జి శ్రీ జె. ఎన్. వాఘ్రే నేడు నిర్దోషి అని వదిలేశారు.

తన భార్య శ్రీమతి కమలమ్మను హత్యచేశాడనే నేరానికి పోలీసులు గత ఆగస్టు 10 వ తేదీన గజపతిరావు నాయుడును అరెస్టు చేశారు.

వరోషిలోవ్ ఇండియా పర్యటన

మాస్కో, డిసెంబర్ 4

రష్యా అధ్యక్షుడు శ్రీ క్లిమెంట్ వరోషిలోవ్ భారత రిపబ్లిక్ దినోత్సవాలలో పాల్గొంటారు. శ్రీ వరోషిలోవ్ జనవరి రెండవ వారంలో భారత దేశం వస్తున్నారు

కేరళ వ్యవసాయ సంబంధాల బిల్లులో మార్పులు సంభవం

న్యూఢిల్లీ, డిసెంబర్ 4

కేరళలో కమ్యూనిస్టు మంత్రివర్గం హయాంలో రూపొందించబడి, అప్పటి అసెంబ్లీ చేత ఆమోదించ బడిన వ్యవసాయ సంబంధాల బిల్లులో కొన్ని సవరణలు చేయటం సంభవమని లోక్ సభలో దేశ వ్యవహారాల మంత్రి శ్రీ జి. బి. పంత్ సూచించారు.

ఆ బిల్లుకు వ్యతిరేకంగా వ్యక్తుల నుంచి, సంస్థల నుంచి అనేక ప్రాతినిధ్యాలు వచ్చాయని శ్రీ టి. సి. ఎన్. మీనన్ ప్రశ్నకు సమాధానమిస్తూ ఆయన చెప్పారు.

రాజాజీ, రంగా

హైదరాబాద్, డిసెంబర్ 4

స్వతంత్ర పార్టీ అధ్యక్షుడు శ్రీ ఎన్. జి. రంగా నేడు తెనుగూరు నుంచి ఢిల్లీ వెళుతూ ఇక్కడి బేగంపేట విమానాశ్రయంలో కొద్దిసేపు ఆగారు. స్థానిక స్వతంత్ర పార్టీ సభ్యులు ఆయనను కలిశారు. శ్రీ రంగా తిరిగి డిసెంబర్ 8వ తేదీన నగరానికి వస్తారు.

రాజాజీ కూడా ఆరోజున నగరానికి రాగలరని తెలుస్తున్నది.

సంజీవరెడ్డి ఎన్నిక రాష్ట్రానికి గర్వకారణం

పి. సి. సి. అధ్యక్షుని హర్ష ప్రకటన

హైద్రాబాద్, డిసెంబర్ 4

కాంగ్రెస్ అధ్యక్షుడుగా పార్టీ రంగా ఎన్నికైనందుకు ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిని, ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ పిడతల రంగారెడ్డి నేడు అభినందించారు.

ఈ సందర్భంలో ఒక ప్రకటన చేస్తూ శ్రీ రంగారెడ్డి ఇలా అన్నారు: "మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర ప్రాంతం విడిపోవటానికి, ఆ తర్వాత తెలంగాణా, ఆంధ్ర ఏకం కావటానికి జరిగిన కృషిలో శ్రీ సంజీవరెడ్డి నిర్వహించిన పాత్రను ఈ ప్రదేశం ప్రజలు స్వేచ్ఛా జ్ఞాపకముంచుకొంటారు. ముఖ్య మంత్రిగా ఆయన రాష్ట్ర నౌకను సుగతిమైన రేవునకు చేర్చి, కాలపరీక్షలో నెగ్గటమేగాక విశేష ప్రతిభా సంపన్నుడైన పరిపాలకుడుగా గణుతికెక్కారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఇంకా శైశవావస్థలోనే ఉన్నది గనుక ఆయన స్థానంలో ముఖ్యమంత్రిగా వచ్చే వ్యక్తి ఎంతో చాతుర్యంతో వ్యవహరించవలసి ఉంటుంది.

"కాంగ్రెస్ చరిత్రలో అధ్యక్ష పదవిని నిర్వహించిన ఏ వ్యక్తికి కూడా ఎదుర్కోనట వంటి సమస్యలు ఈ నాడు శ్రీ సంజీవరెడ్డిని ఎదుర్కొంటున్నాయి. వీటిని ధైర్యసాహసాలతో సమర్థించవలసి ఉంటుంది. ఈ విషయంలో ఎలాటి మచ్చలేని సచ్ఛీలము, వాటలేని ధైర్య సాహసాలు వీటన్నిటినీ మించి దేశ క్షేమం కోసం అంతరాత్మ చేసిన త్యాగాలు ఒక కవచంగా మారి ఈ సూత్ర బాధ్యతల నిర్వహణలో ఆయనను రక్షిస్తూ ఉంటాయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని ఈ అత్యంత ఉన్నత పదవినీ, బాధ్యతలను స్వీకరించాలని కోరబడటం ఈ రాష్ట్ర ప్రజలకు ఎ. ఐ. సి. సి కి గర్వకారణం. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ సమావేశం ఇటీవల జరిగినప్పుడు ఆయన శ్లాఘిస్తూ సభ్యులు చేసిన ప్రసంగాలనుబట్టి చూస్తే రాష్ట్ర కాంగ్రెస్ సంస్థ ఆయనకు తన సంపూర్ణ సహకారాన్ని అందజేస్తుందని, కాంగ్రెస్ అధ్యక్షుని పట్ల విశ్వాసపాత్రంగా వ్యవహరిస్తుందని స్పష్టమౌతున్నది. కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఆయన అపూర్వ విజయం సాధించ గలగాలని మేము భగవంతుని ప్రార్థిస్తున్నాం."

తాజావార్తలు

ఖాట్మాండూ, డిసెంబర్ 4

"నేపాల్‌పై దాడి జరిగితే ఇండియాపై జరిగినట్టే భావిస్తామని" ఇటీవల లోక్ సభలో ప్రధాని నెహ్రూ చేసిన ప్రకటన పట్ల ఆనందం తెల్పుతూ కొన్ని వేల మంది నేపాల్ విద్యార్థులు, యువకులు నేడు భారత రాయబార కార్యాలయం ముందు ప్రదర్శనలు జరిపి, ఒక మెమొరాండం సమర్పించారు.

* * *

ఖాట్మాండూ, డిసెంబర్ 4

52 లోట్ల రూపాయల వ్యయంతో భారత ప్రభుత్వం తలపెట్టిన గండకి ప్రాజెక్టును నేపాల్ భూభాగంలో నిర్మించటానికి అంగీకరిస్తూ ఇండియాతో ఒక ఒప్పందంపై నేపాల్ నేడు సంతకం చేసినది.

అయిదవ అఖిల భారత చేతి పనుల వారం
అమ్మకాలపై ప్రత్యేక రిబేట్

1959 డిసెంబర్ 5 శనివారం నుంచి 1959 డిసెంబర్ 13 వరకు హైదరాబాద్-దక్కన్ గన్ పౌండ్రీలోని ప్రభుత్వ చేతి పనులు, కుటీర పరిశ్రమల అమ్మకం డిపోలో "అయిదవ అఖిల భారత చేతి పనుల" వారాన్ని, చేతి పనుల ప్రదర్శన (డిస్ ప్లే)ను జరపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పరిశ్రమల శాఖలో, నిర్ణయించింది.

ఈ వారాన్ని 1959 డిసెంబర్ 5 శనివారం సాయంకాలం 5 గంటలకి ఆరంభించటానికి వ్యవసాయ మంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి అధ్యక్షత వహించటానికి దేవ ధర్మాదాయాలు, పరిశ్రమల మంత్రి శ్రీ ఎ. కనకవంతరావు, ఎమ్. ఎ., ఎల్. ఎల్. బి., గార్లు అంగీకరించారు.

చేతి పనులు, కుటీర పరిశ్రమలలో తయారయిన వివిధ రకాల వస్తువులను చూడటానికి యీ వారోత్సవం ప్రజలకు చక్కని అవకాశం ఇస్తుంది. కనుక, యీ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకుని తద్వారా చేతి వృత్తులకు ప్రోత్సాహమిమ్మని పరిశ్రమల శాఖ ప్రత్యేకించి ప్రజానీకాన్ని కోరుతున్నది.

ఈ వారంలో కొన్న చేతి పని వస్తువులన్నిటికి రూపాయకు పది నయాపైసల చొప్పున ప్రత్యేక రిబేట్ ఇవ్వబడుతుంది.

వికారీ నామ సంవత్సరం
శనివారం, డిసెంబర్ 5, 1959
మార్గశిర శుద్ధ షష్ఠి
షష్ఠి రా॥ 2-19
శ్రవణం మ॥ 12-18
వర్జ్యం సా॥ 4-11 మొ॥ 5-44 కు

ఆంధ్రజనత

టెలిఫోన్ నెంబరు 4960

శనివారం, డిసెంబర్ 5, 1959

పన్నుల ఎగవేత

"రాజు సొమ్ములను రాజు కివ్వాలి" అన్నది ఒక ఆంగ్ల సామెత. నిజానికి ఇది ఒక పవిత్ర సూత్రం. కాని ప్రతి దేశంలోను దీన్ని గొప్పో గొప్పో ఈ సూత్రాన్ని ఉల్లంఘిస్తూనే ఉన్నారు. మన దేశంలో ఈ జాడ్యం మరీ హెచ్చు.

పన్నులను ఎగవేసే వారు సాధారణంగా ధనిక వర్గాల వారే. మధ్య తరగతి, బీద ప్రజలపై పడే పన్నులు పరోక్ష పన్నులు కాబట్టి, అవి ఎప్పుడూ వసూలు ఔతూనే ఉంటాయి. ప్రత్యక్ష పన్నులు చెల్లించ వలసిన ధనాఢ్యులే దొంగ లెక్కలు చూపించి, అధికారులను మోసం చేసి పన్నులను ఎగవేస్తూ ఉంటారు.

పన్నులను ఎగగొట్టడం అన్నది పెద్ద నేరం అన్న మాట అటుంచి, పరోక్ష పన్నులను కచ్చితంగా వసూలు చేయటం లేని దేశం సోషలిస్టు దేశం అనిపించుకొన జాలదు. వ్యక్తిగత ఆదాయాలలోని తారతమ్యాలను తగ్గించటానికి, వీలైతే తొలగించటానికి, పన్నుల విధానం సాధన భూతం కాబట్టి, పన్నుల వసూళ్ళ విషయంలో సమర్థవంతంగా పని చెయ్యలేని సోషలిస్టు ప్రభుత్వం ఏదైనా మాట పడవలసి ఉంటుంది.

మన దేశంలో పన్నుల ఎగవేత ఎంతవరకు ఉన్నదో ఇదమిద్ధంగా తేలలేదు. కాని ప్రొఫెసర్ కాల్డార్ మాత్రం పన్నుల ఎగవేత మూలంగా ప్రభుత్వానికి ఏటా 200 కోట్ల రూపాయల నష్ట సంభవిస్తున్నదని అంచనా వేసారు. ఈ విషయాన్ని పరిశీలించటానికి కేంద్ర ప్రభుత్వం నియమించిన త్యాగి కమిటీ ప్రొఫెసర్ కాల్డార్ అంచనాను అంగీకరించలేదు కాని పన్నుల ఎగవేత మన దేశంలో చాలా విపరీతంగా ఉన్నదని మాత్రం స్పష్టంగా తమ నివేదికలో పేర్కొన్నారు.

త్యాగి కమిటీ మరొక విషయాన్ని కూడా బయట పెట్టారు. పన్నుల ఎగవేత ఇంత విపరీతంగా ఉండటానికి చట్టం లోపభూయిష్టంగా ఉండటం కారణం కాదని, అధికారు లప్రమత్తత, బాధ్యతా రాహిత్యం, అసమర్థత వల్లనే ధనిక వర్గాల వారు ఈ దారుణానికి ఒడిగట్ట గలుగు తున్నారని కమిటీ తన నివేదికలో పేర్కొన్నారు. ఇందుకు ఉదాహరణలుగా వారు కొన్ని విషయాలను పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 12 ఏళ్లు అయినప్పటికీ, ఇంతవరకు ఆదాయం పన్ను అధికారులు పన్నులు ఎగవేసిన వారిపై ఒక్క కేసు కూడా పెట్టలేదు. బ్రిటన్, అమెరికా దేశాలలో పన్నులు ఎగవేసే వారికి తగిన గుణ పాఠం నేర్పేటందుకు వారు ప్రతి సందర్భంలో కొందరి పై కేసులు పెట్టి, శిక్షలు విధించటం జరుగు. కాని మన చట్టంలో కూడా ఇట్టి అవకాశం ఉన్నప్పటికీ, అధికారులు దానిని వినియోగించటం లేదు. ఇటువంటి ఘోరమైన నేరం చేసిన వారిపై కేసులు పెట్టక పోవటమే కాకుండా, చట్ట రీత్యా సరి చదగు జరిమానాలను కూడా విధించటం లేదని కమిటీ వారు పేర్కొన్నారు. చట్ట రీత్యా ఎగవేసిన పన్నుకు ఒకటిన్నర రెట్లు జరిమానా విధించవచ్చు. కాని ఇంతవరకు ఎట్టి సందర్భంలోను సగం కంటె ఎక్కువ జరిమానా విధించ లేదు అధికారులు.

కోట్లకు కోట్లు పన్నులు ఎగవేసే వారి పట్ల అధికారులు ఇట్టి ఔదాసీన్యం వహించటం అన్నది సహించరాని విషయం. చట్టం ఎంత లోపరహితంగాను, కట్టు దిట్టంగాను ఉన్నా, అధికారులు దానిని సక్రమంగాను, కచ్చితంగాను అమలు పరచక పోతే, పన్నులు ఎగవేసే వారు మరింత మొండికెత్తటం తథ్యం. అందుచేత, పన్నులు ఎగవేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం అధికారులను గట్టిగా హెచ్చరించవలసి ఉన్నది.

పన్నుల ఎగవేతను అరికట్టడానికి త్యాగి కమిటీ కొన్ని ఉత్తమ సూచనలు కూడా చేసింది. పన్నులు ఎగవేసే వారిని పట్టుకొని, వారిపై కేసులు పెట్టడానికి ఒక ప్రత్యేక శాఖను ఏర్పాటు చెయ్యాలన్నది వారు చేసిన సూచనలలో ముఖ్యమైనది. ఇటువంటి శాఖను ఏర్పాటుచేసినట్లయితే, తన ఉనికిని సార్థకం చేసుకొనటానికైనా అదికొన్ని కేసులు పెట్టి తీరుతుంది. దీనివల్ల చాలా ప్రయోజనం ఉంటుంది. కోర్టులకు జరిమానాను తగ్గించే అధికారం లేకుండా చెయ్యాలని, 500 రూపాయలకు పైగా పన్ను ఎగవేసిన వ్యక్తుల పేర్లు గెజిట్‌లోనూ, పత్రికలలోను ప్రచురించాలని, ట్రస్టులు ఏర్పరచి కుంభకోణం చెయ్యటానికి వీలులేకుండా చట్టంలో తగు మార్పులు చెయ్యాలని కూడా త్యాగి కమిటీ సూచించింది. ఈ సూచనలను ప్రభుత్వం అమలు పరచగలదని ఆశిస్తున్నాం.

భారత దేశంలో అభివృద్ధి కృషి

యుగోస్లావ్ ప్రతినిధి ప్రశంస

న్యూఢిల్లీ, డిసెంబర్ 2

పంచాయతీలు, సహకార సంఘాలు, సంస్థల నిర్వహణలో కార్మికుల భాగస్వామ్యం ముఖ్యమైన చర్యల ద్వారా ప్రజల సృజనాత్మక శక్తికి ప్రోత్సాహం కలిగి, స్వల్ప కాలపు భారత దేశం ఆర్థిక, సాంఘిక రంగాలలో అభివృద్ధిని సాధించగలదని యుగోస్లావ్ ప్రభుత్వ ప్రతినిధి వర్గ నాయకుడు మిలెంటి బటపాపావిచ్ నేడిక్కడ అన్నారు.

సెల రోజులపాటు భారత దేశంలో పర్యటన జరిపి స్వదేశానికి తిరిగి వెళ్ళే ముందు ఆయన ఈ ప్రకటనను చేశారు.

ఈ మధ్య అంతర్జాతీయ సంబంధాల విషయంలో ఇండియా కొన్ని చిక్కులను ఎదుర్కొంటున్నదనీ, ప్రపంచ మంతటా ప్రచ్ఛన్న యుద్ధాన్ని అంతమొందించాలని ఆందోళన జరుగుతున్న ఈరోజులలో సహజీవన సిద్ధాంతాన్ని సృష్టించిన భారత దేశానికి ఈ చిక్కులు కలగడం వింతగా ఉన్నదనీ ఆయన అన్నారు.

న్యూఢిల్లీ, డిసెంబర్ 3

[illegible] చైనీస్ పైలెట్ల కాల్పుల ఫలితంగా మరణించిన సరిహద్దు పోలీసుల కుటుంబాలకు రెండు వేల రూపాయల పరిహారం ఇవ్వటానికి ప్రభుత్వం నిశ్చయించినట్టు కేంద్ర హోం వ్యవహారాల మంత్రి శ్రీ దాదాభాయ్ ఇటీవల రాజ్యసభలో ప్రకటించారు.

చైనా సమస్యపై కూడా ఐసెన్‌హోవర్‌తో చర్చ

న్యూఢిల్లీ, డిసెంబర్ 3

అమెరికా అధ్యక్షుడితో తాను జరుపబోయే సమాలోచనలకు నిర్దుష్టమైన ఎజెండా ఏదీ లేదనీ, వివిధ ప్రపంచ సమస్యలతో బాటు చైనా సమస్య కూడా చర్చకు రావలసిందే (ప్రధాని నెహ్రూ) నేడు విలేఖరుల సమావేశంలో అన్నారు.

అనేక విషయాలలో అభిప్రాయాలను వెల్లడించి, ఒకరినొకరు అర్థం చేసుకొనడానికి తాము ప్రయత్నించ గలమని కూడా ప్రధాని అన్నారు.

ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితిలో వచ్చిన పరిణామాలు ప్రధాన చర్చనీయ సమస్య అని తాను భావిస్తున్నానని, ఈ పరిణామాలతో అనేక సమస్యలు ముడిపడి ఉన్నాయనీ శ్రీ నెహ్రూ అన్నారు.

ఈ ప్రధాన సమస్యలను గురించి మాత్రమే కాక, స్థానిక సమస్యలను గురించి కూడా చర్చలు జరుగ గలవనీ, భారత దేశపు ప్రధానాళికల పట్ల అమెరికా అధ్యక్షుడు ఎంతో ఆసక్తిని ప్రదర్శించారనీ ప్రధాని వివరించారు.

నెహ్రూ-అయూబ్ సమావేశం

ఏప్రిల్ లో తాను ప్రధాని నెహ్రూను కలుసుకొన గలనని పాకిస్తాన్ అధ్యక్షుడు చేసిన ప్రకటనను ఒక విలేఖరి ప్రధాని దృష్టికి తీసుకొనిరాగా, ఆ విషయంలో తన కెటువంటి సమాచారం లేదనీ, ఆసమావేశం ఏప్రిల్ లో జరగడం అనుమానాస్పదమనీ ఆయన అన్నారు.

శిఖరాగ్ర సమావేశంలో జర్మనీ సమస్యకు కాక నిరాయుధీకరణ సమస్యకు ప్రాధాన్యత నివ్వాలని ఒక విలేఖరి సూచించి, ఈ విషయంలో ప్రధాని అభిప్రాయాన్ని కోరారు.

ప్రధాని ఆ ప్రశ్నకు జవాబిస్తూ నిరాయుధీకరణ సమస్య నిస్సంశయంగా ముఖ్యమైనదేనని, తప్పక చర్చించబడగలదని అన్నారు. జర్మనీ సమైక్యత విషయాన్ని ప్రస్తావించి ఈ సమైక్యతను ఏ రాజ్యమూ కోరడం లేదని తాను భావిస్తున్నానని ఆయనఅన్నారు. "ఈ విషయాన్ని గురించి చాలా మాట్లాడ్డం జరుగుతోంది. ఎవళ్ళూ ఈ జర్మనీ సమైక్యతను కోరడం లేదు ఈ పద్ధతి నాకేమీ అర్థం కావటంలేదు" అన్నారు ప్రధాని నెహ్రూ. ఈ సమైక్యత వల్ల సంభవించే పరిణామాలను గురించి భయపడుతున్నారనీ, ప్రతివారూ తమకు, నూటికి నూరు పాళ్ళు అంగీకారయోగ్యమైన పరిష్కారం కావాలని కోరుతున్నారని ప్రధాని వివరించారు.

బ్రిటన్, ఈజిప్టు దౌత్య సంబంధాల పునరుద్ధరణ

కైరో, డిసెంబర్ 1

1956లో సూయజ్ యుద్ధ సందర్భంలో రద్దుకాబడిన ఇంగ్లండు, ఈజిప్టుల మధ్య దౌత్య సంబంధాలు నేటి నుంచి పునరుద్ధరించబడినట్లు ఉభయ ప్రభుత్వాలు ప్రకటించాయి. మొదటలో దౌత్య వ్యవహార్తుల నియామకం జరుగగలదనీ, అ తరువాత రాయబారుల నియామకం జరుగగలదనీ ఈ ప్రభుత్వాలు పేర్కొన్నాయి. లండన్‌లో ఈజిప్టు ప్రతినిధిగా కెమల్ ఖలీల్, కైరోలో ఇంగ్లండు ప్రతినిధిగా కోలిన్ క్రోయిలు ప్రస్తుతం వ్యవహరిస్తారు.

సైప్రస్ కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగింపు

నికోషియా, డిసెంబర్ 2

సుమారు 4 సంవత్సరాల క్రితం సైప్రస్‌లో అత్యవసర పరిస్థితి ప్రకటింప బడినప్పుడు అచటి కమ్యూనిస్టు పార్టీపై విధించబడిన నిషేధం నేడు తొలగించ బడింది.

సైప్రస్ కమ్యూనిస్టు పార్టీతో సంబంధం కలిగిన మరో మూడు సంస్థలపైన, 5 పత్రికలపైన ఉన్న నిషేధం కూడా తొలగించ బడింది. అత్యవసర పరిస్థితి కూడా ఈ వారంలో తొలగించ బడుతుందని సైప్రస్ గవర్నర్ నిన్న అన్నారు.

కొందరు సైనికాధికారులపై ఆరోపణల విచారణ

న్యూఢిల్లీ, డిసెంబర్ 3

కొందరు సైనికాధికారులు నియమ విరుద్ధంగా ప్రవర్తించారంటూ చేయబడిన ఆరోపణలను పరిశోధించేందుకు ప్రత్యేక పోలీసు శాఖకు అప్పగించబడినట్లు రక్షణ శాఖ ఉపమంత్రి శ్రీ రఘురామయ్య నేడు రాజ్యసభలో వెల్లడించారు. ఒక కేసు విషయంలో ప్రత్యేక పోలీసు శాఖ నివేదిక చేరిందనీ, మరో నివేదిక చేరవలసి ఉన్నదనీ కూడా అయన అన్నారు. ఈ నివేదికలు చేరిన తరువాత సైనిక ప్రధాన కార్యాలయంతో సంప్రదించి తగు చర్యలు తీసుకొనబడగలవని ఆయన అన్నారు.

సంపాదక లేఖలు

పోష్టాఫీసు అవసరం

ఆర్యా! నిజామాబాద్ జిల్లా బోధన్ తాలూకా సంటక్కుర్తు గ్రామంలో 4 వేల జనాభా గలదు. ఈ గ్రామానికి అందుబాటులో రాయకూరు, విఠ్ఠాపురం గ్రామాలు ఒక మైలు దూరంలో కలవు. ఈ గ్రామాలలో 3 వేల జనాభా కలదు. మొత్తం 7 వేల జనాభా అందుబాటులో ఉంటే సంటక్కుర్తు గ్రామంలో పోష్టాఫీసు అవసరం. ఈ గ్రామంలో సువాయతీ బోర్డు కూడా ఉన్నది. యీ గ్రామాల నుండి వుత్తర ప్రత్యుత్తరాలకు జనులు చాలా యిబ్బంది పడుతున్నారు. కనుక వెంటనే సంటక్కుర్తు గ్రామంలో పోష్టాఫీసు ఏర్పరచి, ప్రజల యిబ్బంది తీర్చాని కోరుతున్నాము.

సంటక్కుర్తు, చల్లా గంగారెడ్డి,
వరుచూరి కోటేశ్వరరావు.

* * *

పరంగల్-నిజామాబాద్‌కు రైలు మార్గం

ఆర్యా! నిజాము ప్రభుత్వము కాలములో, సుమారు 20 సంవత్సరముల క్రితము, పెద్దపల్లి, జగిత్యాల, కోరుట్ల, కమ్మరి పెల్లి, ఆరుమూరు నుండి నిజామాబాద్‌కు ఒక రైలు మార్గము వేయాలని తలచారు. ఆమార్గం గురించి, జగిత్యాల, కోరుట్ల, కమ్మరి పెల్లి, ఆరుమూరులో రైలు మార్గము హద్దురాళ్లు సిమెంటుతో కట్టి యుండిరి. ఆ రాళ్ళు యిప్పటికీ కూడా కనబడుతున్నాయి. ఆ రైలు మార్గము ఎందుకు వేయ లేదో కారణము తెలియదు. ఆ రైలు మార్గము ప్లాను ఏమయిందో?

ముఖ్యంగా, తెలంగాణాలో, వరంగల్, నిజామాబాద్ పెద్ద వ్యాపార కేంద్రాలు. వీటిని సరాసరి రైలు మార్గము ద్వారా కలపటము వ్యాపారానికి, రాకపోకల సౌకర్యానికి అత్యంత ప్రయోజనకరం.

ఈ రైలు మార్గము వరంగల్ నుండి ప్రారంభించి, జమ్మికుంట నుండి కరీంనగరము, జగిత్యాల, కోరుట్ల, కమ్మరి పెల్లి, ఆరుమూరు మీదుగా నిజామాబాద్ జిల్లాలోని సుమారు 6 లక్షల ప్రజలకు ఉపయోగ పడగలదు. వ్యాపారము అభివృద్ధి చెంద గలదు. ప్రజల ప్రయాణ ఖర్చులు తగ్గ గలవు. ఆంధ్ర ప్రభుత్వము ఈ అంశాన్ని పరిశీలించి ఈ రైలు మార్గమును తృతీయ పంచవర్ష ప్రణాళికలో చేర్పించే విషయమై రైల్వే మంత్రిత్వం వారిపై ఒత్తిడి తేవాలని మనవి.

(బొంబాయి.) బాసా నారాయణ

హంగేరీ సోషలిస్టుల కృషి

కృశ్చేవ్ ప్రశంస

బుడాపెస్ట్, డిసెంబర్ 1

హంగెరీలో సోషలిజాన్ని భగ్నం చేయాలన్న సామ్రాజ్య వాదుల ఆశలన్నీ అడుగంటినవని సోవియట్ ప్రధాని కృశ్చేవ్ హంగేరియన్ సోషలిస్ట్ వర్కర్స్ (కమ్యూనిస్టు) పార్టీ సమావేశంలో అన్నారు

గత 1956వ సంవత్సరంలో విప్లవ వ్యతిరేకోద్యమం తాత్కాలికంగా మాత్రమే దేశంలో కొంత అలజడి కలిగించినదనీ, అయితే అందుకు పార్టీ నాయకత్వం కొంత వరకు కారణమనీ ఆయన అన్నారు

హంగేరియన్ సోషలిస్ట్ కార్యకర్తల కృషిని ఆయన ప్రశంసించారు.

భారత దేశంలో రాగి ఖనిజం ఉత్పత్తి

న్యూఢిల్లీ, డిసెంబర్ 2

భారత దేశంలో 1959 జనవరి - అక్టోబర్ నెలల మధ్య 338,000 మెట్రిక్ టన్నుల రాగి ఖనిజం ఉత్పత్తి అయిందని భారత గనుల సమాచార కార్యాలయం ప్రకటించింది. నిరుడు అదే కాలంలో 341,000 టన్నుల రాగి ఖనిజం ఉత్పత్తి అయింది.

పైన పేర్కొన్న రాగి ఖనిజం మొత్తం పూర్తిగా బీహారు రాష్ట్రంలో సింగ్‌భం జిల్లాలోనే ఉత్పత్తి అయింది.

1959 జనవరి-అక్టోబర్ నెలలమధ్య 6,759 మెట్రిక్ టన్నుల రాగి లోహం ఉత్పత్తి అయింది. నిరుడు అదే కాలంలో ఉత్పత్తి అయిన రాగి 6,570 మెట్రిక్ టన్నులు.

భిలాయ్ కర్మాగారానికి కలప సరఫరాపై ఆరోపణలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 3

భిలాయ్ ఉక్కు కర్మాగారానికి ఒక [illegible] సంస్థ సరఫరా చేసిన కలప [illegible] సరఫరా చేసిన ఒక [illegible] సంస్థపై వచ్చిన ఆరోపణలు విచారించబడుతున్నాయనీ ఉక్కు గనుల శాఖా మంత్రి శ్రీ [illegible] సింగ్ నేడు రాజ్య సభలో అన్నారు. ఆ సంస్థ సరఫరా చేసిన వేల దూలాలలో 1400 పనికి ఉపయోగకరంగా ఉన్నాయనీ, ఆ విషయమై వచ్చిన ఒక ఆకాశరామన్న ఫిర్యాదును పురస్కరించుకొని విచారణ [illegible] అయిన అన్నారు.

ఫ్రాన్స్‌లో జల ప్రళయం

ఆనకట్ట తెగి వరదలు రాగా 270 మంది మరణం

ఫ్రెజూస్ (ఫ్రాన్స్), డిసెంబర్ 3

ఆనకట్ట తెగి, కొండ మీదకు వరద ప్రవాహం నిరుచుకు వచ్చిన కారణంగా, రివీరా ప్రాంతంలో పది చదరపు మైళ్ళ ప్రదేశం జలమయమైపోయింది. సహాయ దళాల కృషి వల్ల ఇంత వరకు 270 మంది శవాలు ఏటి ప్రవాహంలో నుంచి బైటకు తీయబడినాయి.

అంతకు అనేక మంది వరద ప్రవాహంలో కొట్టుకుపోయి ఉంటారని తలచ బడుతున్నది. ఈ ప్రాంతంలో ఆసుపత్రుల నిండా క్షతగాత్రులైన జనం, వరద పరిస్థితి ప్రాంతం అంతటా దోపిడీలాంటి సంఘ విద్రోహ కార్యలు జరక్కుండా పోలీసులు గస్తీ తిరుగుతున్నారు. విషాదమైన ఈ వరద ప్రమాదం పట్ల సానుభూతి చిహ్నంగా అధ్యక్షుడు డి గాల్ అధికారికంగా ఖర్చే లేనిటి విందు నొకదాన్ని రద్దు చేశారు. పారిస్‌లో సమావేశం అవుతున్న ఫ్రెంచి జాతీయ సభ (పార్లమెంట్) వెంటనే ఆ రోజుకు వాయిదా పడింది.

మూడు రోజుల అతివృష్టి అనంతరం ఆనకట్టను తెంచుకొని, ముప్పయి అడుగుల ఎత్తున గ్రామాలను కలియబెట్టుకుంటూ, పొంగి వచ్చే జల ప్రళయానికి యింకా ఎంత మంది బలి అయ్యారో తేలకుండా ఉన్నది.

రాజకీయ పార్టీలపై నిషేధానికి నెహ్రూ వ్యతిరేకత

న్యూఢిల్లీ, డిసెంబర్ 2

పరిస్థితులు మరీభయంకరంగా అసాధారణ రూపం ధరిస్తేనే తప్పించి రాజకీయ పక్షాలను, ముఠాలను నిషేధించటానికి రాజ్యాంగ రీత్యా తాను వ్యతిరేకిస్తున్నానని ప్రధాని నెహ్రూ నేడు విలేఖరుల గోష్ఠిలో అన్నారు.

రాజకీయ పక్షాలను నిషేధించాలని ప్రభుత్వం అనుకోవటంలేదని ప్రధాని నెహ్రూ స్పష్టం చేసారు.

కమ్యూనిస్టు పార్టీని నిషేధించాలని కొన్ని వర్గాలు కోరుతున్న విషయాన్ని గూర్చి ఒక విలేఖరి ప్రస్తావించగా ప్రధాని నెహ్రూపై విధంగా అన్నారు.

కమ్యూనిస్టు పార్టీ విషయంలో పరిస్థితులు భయంకరంగా అసాధారణ రూపం ధరించినట్టు మీరు భావించటం లేదా అని మరో విలేఖరి అడిగిన ప్రశ్నకు ఆయన లేదని సమాధాన మిచ్చారు.

చైనా పట్ల శ్రీ నెహ్రూ విధానం

శ్రీ జయప్రకాశ్ వివరణ

లండన్, డిసెంబర్ 3

చైనాపట్ల విస్పష్టమైన విధానాన్ని అనుసరిస్తున్న ప్రధాని నెహ్రూను భారతీయు లందరూబలపరుస్తున్నారనీ, ఈ విషయంలో ఆయనను విమర్శించే వారికి భారత దేశంలో ఎటువంటి ప్రాధాన్యతా లేదనీ శ్రీ జయప్రకాశ్ నారాయణ్ బ్రిటిష్ విలేఖరులతో అన్నట్లు టైమ్సు పత్రిక ప్రకటించింది

ప్రధాని నెహ్రూ మానసికంగానూ, శారీరకంగానూ పూర్తి శక్తియుక్తులతో ఉన్నారనీ, వయోభారం పెరిగిన తరువాత కంటె ప్రస్తుత స్థితిలోనే ఆయన రాజకీయాలనుంచి విరమించడం మంచిదనీ శ్రీ జయప్రకాశ్ అన్నారు

ప్రధాని నెహ్రూను పదవి చట్టంతో శ్రీ జయప్రకాశ్ పోల్చి, ఆయనకు నీడ సుఖాన్ని కల్గించినప్పటికీ మరో చెట్టు పరగడానికి తోడ్పడదనిఆయన అన్నట్లు టైమ్స్ పత్రిక ప్రకటించింది.

ఇండియా-బర్మా బియ్యం ఒడంబడిక

త్వరలో జరుగుతుందని శ్రీ పాటిల్ ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబర్ 3

ప్రస్తుతం బర్మా నుంచి ఇండియాకు బియ్యాన్ని సరఫరా చేయడానికి ఉద్దేశించబడిన ఒడంబడిక కాలపరిమితి పూర్తికాగానే మరో 5 సంవత్సరాల కాలానికి దానిని కుదుర్చుకొనడానికి ఇండియా నిశ్చయించిందని ఆహార శాఖా మంత్రి శ్రీ పాటిల్ నేడు లోక్‌సభలో వెల్లడించారు.

అంతకు ముందు ఆహార శాఖ ఉపమంత్రి శ్రీ [illegible], 1 1/2 లక్షల టన్నుల బియ్యాన్ని ఫిబ్రవరి నెలలో ఇండియా-బర్మాల మధ్య జరిగిన అనుబంధపు ఒడంబడిక వివరాలను తెలియజేశారు.

బర్మా విధిస్తున్న ధర ఇతర దేశాల బియ్యపు ధరతో సమంగా ఉన్నదా అని అనేక మంది సభ్యులు ప్రశ్నించారు. ఇండియా ఇతర దేశాల నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకొనడం లేదనీ, అమెరికా నుంచి మాత్రమే పి. యల్. 480 నిబంధన క్రింద 1 1/2 లక్షల టన్నులను దిగుమతి చేసుకొనాలనీ యోచిస్తున్నట్లు ఆయన అన్నారు.

బర్మా బియ్యం మన దేశానికి చేరేసరికి మణుగు 18,19 రూపాయల ఖరీదు అవుతుందని ఆయన అన్నారు. ప్రతి దేశం నుంచి బియ్యాన్ని కొనడం సాధ్యం కాదనీ, అమెరికా నుంచి దిగుమతి అయే బియ్యం ధరలను తగిన వ్యవధి ఇస్తే లోక్ సభకు అందజేయగలనని శ్రీ పాటిల్ అన్నారు.

తంతి, తపాలా బోర్డుకు స్వతంత్రాధికారాలు

వైనందిన వ్యవహారాలలో ప్రభుత్వ జోక్యం ఉండదని మంత్రి హామీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 3

నూతన తంతి, తపాలా బోర్డు కొంత వరకు స్వతంత్రాధికారాలు కలిగి ఉంటుందని రవాణా మంత్రి డాక్టర్ పి. సుబ్బరాయన్ నేడు లోక్‌సభలో అన్నారు. ఈ బోర్డుకు కొన్ని విధానాలను రూపొందించే అధికారం కూడా ఉంటుందనీ, అయితే వాటిని మంత్రి ఆమోదించవలసి ఉంటుందని ఆయన అన్నారు.

రవాణా శాఖ కార్యదర్శి కాని, మంత్రి కాని ఈ బోర్డు దైనందిన వ్యవహారాలలో జోక్యం కలుగజేసుకోరని ఆయన సభకు హామీ ఇచ్చారు.

బోర్డు ఈ నెల రెండవ వారంలో పని ప్రారంభించగలదని భావించబడుతున్నది.

ప్రభుత్వం తలపెట్టిన ఈ బోర్డు నిర్మాణాన్ని గురించి కాంగ్రెస్ సభ్యుడు శ్రీ హెచ్. సి. మాథుర్ లేవదీసిన చర్చ మధ్యలో జోక్యం కలుగజేసుకొని మంత్రి పై విధంగా అన్నారు.

శ్రీ మాథుర్ తంతులకు టెలిఫోనుకు ఒకటి, తపాలాకు మరొకటి రెండు బోర్డులు స్థాపించాలని కోరారు. ఈ కొత్త బోర్డుకు రైల్వే బోర్డుకు ఉన్న అధికారాలు ఉండాలని శ్రీ హేమ్ బారువా (పి.ఎస్.పి.) అన్నారు.

మలయా అధ్యక్షుని ప్రమాణ స్వీకరణ

సింగపూర్, డిసెంబర్ 3

మలయా జాతీయుడు యుసాఫ్ ఇషాక్ నేడు మలయా ప్రభుత్వాధినేతగా ప్రమాణం స్వీకరించారు. మొదటి సారిగా సింగపూర్ జాతీయ గీతంతో, జాతీయ గీతం అధికార పూర్వకంగా వినియోగించ బడినాయి. సింగపూర్‌కు బ్రిటన్ ఇచ్చిన అంతరంగిక పాలనా స్వేచ్ఛ వల్ల ఈ మార్పులు జరిగాయి.

శాసన సభ్యులకు రైల్వే కూపన్లు

శ్రీ జగ్‌జీవన్ రామ్ వివరణ

న్యూఢిల్లీ, డిసెంబర్ 3

ఆయారాష్ట్ర ప్రభుత్వాలు శాసన సభ్యులు చేసే ప్రయాణాలకు అయే ఖర్చును భరించ డానికి అంగీకరిస్తే, శాసన సభ్యులకు రైల్వే కూపన్లను ఇచ్చేవిషయం పరిశీలించగలమని రైల్వే మంత్రి శ్రీ జగ్‌జీవన్ రామ్ లోక్ సభలో నేడు అన్నారు. పార్లమెంట్ సభ్యులకు ఇచ్చినట్టే తమతమ రాష్ట్రాలలో శాసన సభ్యులకు కూడా సౌకర్యాలు కల్పించమని ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు అభ్యర్థించాయనీ, పార్లమెంట్ సభ్యులకు కూడా ఉచిత ప్రయాణ సౌకర్యాలు లేవనీ ఆయన వివరించారు.

బొంబాయి దౌత్య కార్యాలయ సంఘటన

పోలీసులకు ఆరమ్ స్ట్రాంగ్ ఫిర్యాదు

బొంబాయి, డిసెంబర్ 3

బొంబాయిలోని అమెరికా దౌత్య ప్రతినిధి కార్యాలయంలోని భద్రతాధికారి ఆరమ్ స్ట్రాంగ్ కొందరు తనపై దోపిడీచేసి చైనా దౌత్య ప్రతినిధి కార్యాలయం ఆవరణలో గత నెల 27 వ తేదీన నిర్బంధించారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తున్నది. ఈ ఫిర్యాదును పురస్కరించుకొని పోలీసులు విచారణ ప్రారంభించినట్లు కూడా తెలుస్తున్నది.

ప్రశాంతంగా రాష్ట్రపతి జన్మ దినోత్సవం

న్యూఢిల్లీ, డిసెంబర్ 3

రాష్ట్రపతి శ్రీ రాజేంద్ర ప్రసాద్ నేడు తన 75 వ జన్మ దినోత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకున్నారు. ఈ సందర్భంలో ఎటువంటి కార్యక్రమాలలోనూ పాల్గొనడానికి ఆయన అంగీకరించ నందువల్ల అధ్యక్షుని అంగరక్షక దళం తలపెట్టిన గౌరవ వందన కార్యక్రమం రద్దు చేయబడింది. ప్రధాని నెహ్రూ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, మంత్రి వర్గ సభ్యులు రాష్ట్రపతిని ఆయన గృహంలోనందర్శించి తమఅభినందనలను తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

హైదరాబాద్, డిసెంబర్ 3

మెదక్ జిల్లా, రామాయంపేట గ్రామానికి చెందిన ప్రముఖ కార్యకర్త శ్రీ భూమాజి కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఆయన వెంట మరో 60 మంది కార్యకర్తలు కూడా కాంగ్రెస్ సభ్యత్వాన్ని స్వీకరిస్తున్నారు.

ఆహారోత్పత్తిని పెంచడానికి తీవ్రకృషి

శ్రీ సేన్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబర్ 3

ప్రపంచంలోని ప్రజలందరూ సుపోషకమైన ఆహారాన్ని కావలసినంతగా పొందాలంటే ఆహారోత్పత్తిని ఇతోధికం చెయ్యడానికి తీవ్ర కృషి జరపాలని ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ అధ్యక్షుడు శ్రీ బి. ఆర్. సేన్ నేడిక్కడ అన్నారు.

వ్యవసాయోత్పత్తి రంగుల అంతర్జాతీయ సమావేశం 11వ మహాసభలో శ్రీ సేన్ ప్రసంగించారు. ప్రపంచంలో ఆకలి బాధను తొలగించడానికి వ్యవసాయోత్పత్తులను పెంచడమే కాక, వాటిని సక్రమంగా పంపకం చెయ్యవలసిన అవసరం కూడా చాలా ఉందని ఆయన అన్నారు. వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను విరివిగా ఉపయోగించడం, పెట్టుబడి వనరులను లక్ష్య సాధనకు అనువుగా వినియోగించడం, స్థానిక పరిస్థితులను అవగాహన చేసుకొనడం అధికోత్పత్తి సాధనకు అవసరమనీ, ఆయా ప్రభుత్వాల సహకారం లేనిదే ఈ లక్ష్యాలను సాధించడం సంభవం కాదనీ శ్రీ సేన్ అన్నారు. ఈ సందర్భంలో ఐక్యరాజ్య సమితి, దాని అనుబంధ సంస్థలు మొదలైన వాటి సహకారాన్ని పొందాలని కూడా ఆయన అన్నారు.

ఇండియా నుంచి సింహళానికి అక్రమ వలసలు

కొలంబో, డిసెంబర్ 3

ఇండియా నుంచి చట్ట విరుద్ధంగా సింహళానికి వలస వస్తున్న వారిని నిరోధించే నిమిత్తం ఒక కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సింహళ ప్రభుత్వం నిశ్చయించింది. అక్రమ వలసను నిరోధించ డానికి సైనికాధికారులూ, సివిల్ అధికారులూ తీసుకునే చర్యలను ఈ కార్యాలయం సమన్వయం చేస్తుంది.

న్యూఢిల్లీ, డిసెంబర్ 3

భారత దేశంలో నివసించడానికి అనుమతి పత్రాలు పొందని విదేశీయులంతా జనవరి 15 తేదీలోగా అటువంటి పత్రాలను పొందాలని భారత ప్రభుత్వం నేడొక ప్రకటనచేసింది. 1948 ఆగస్టు 12 వ తేదీకి పూర్వం నుంచి ఉన్న వారు కూడా ఈ అనుమతి పత్రాలను పొందాలని ఈ ప్రకటనలో వివరించబడింది.

వేలం అమ్మకం

(6-12-1959 ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు) దబీర్‌పూరా దర్వాజ వద్ద (బేరూన్ హరన్ బావులీ) రెండంతస్తుల విశాలమైన పక్కా మరియు పెంకుటిల్లు సిమెంటు రోడ్డున రెండు భాగములు, రెండు మడిగీలతో కలిసి, నెం 22-2-7 మరియు 7/1 మరియు 7/2 వున్నవి. అన్ని అవసరములతో కూడుకుని యున్నవి. రిజిస్ట్రేషన్ కాలములో పూర్తి స్వాధీనం పరచబడును. వివరములకు: ఖాన్ అండ్ సన్స్, లాండ్ అండ్ పావర్టి అక్విజిటర్స్, మోజం జాహి మార్కెటు 18, బ్యాచ్‌లర్స్ క్వార్టర్స్, హైదరాబాద్.

4 వ దిగ్విజయ వారం!

పద్మినీ పిక్చర్స్ వారి

సెబాష్ పిల్లా!

రాహత్ మహల్

ఎల్లారెడ్డిపేటలో విద్యాపోషక సంఘం

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 1

ఎల్లారెడ్డిపేట మాధ్యమిక పాఠశాల పోషకుల సమావేశం గత 27 వ తేదీన జరిగినది. ఈ సమావేశానికి పంచాయతీ అధ్యక్షులు శ్రీ యస్. వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. సభకులు, పోషకులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులమధ్య ఉండవలసినసంబంధాలను గురించి పలువురు ప్రసంగించారు.

అనంతరంజిల్లా విద్యాశాఖఅధికారి, అధ్యక్షులు, స్కూలు ప్రధానోపాధ్యాయులు కార్యదర్శిగాను శ్రీ యస్. వెంకటరెడ్డి ఉపాధ్యక్షులుగాను, మరి ముగ్గురు గ్రామపెద్దలు సంఘ సభ్యులుగాను విద్యా పోషక సంఘం ఏర్పడినది.

సౌరాష్ట్రలో బొగ్గు గనుల అన్వేషణ

రాజకోట, డిసెంబర్ 2

సౌరాష్ట్రలోని తంగడ్ ప్రాంతంలోని బొగ్గు గనులను అన్వేషించే కార్యక్రమాన్ని బొంబాయి ప్రభుత్వం త్వరలో ప్రారంభించ నున్నది.

బొంబాయి ప్రభుత్వం గనుల త్రవ్వకం శాఖ బృందం ఒకటి అన్వేషణ కార్యక్రమాన్ని ఈ నెల 4 వ తేదీని ప్రారంభించ గలదు. మూలి తాలూకాలో ప్రథమంలో త్రవ్వకం కార్యక్రమం ప్రారంభించి, అచ్చట గడించిన అనుభవం దృష్ట్యా ఇతర ప్రాంతాలకు ఈ అన్వేషణ కార్యక్రమం విస్తరింపబడుతుంది.

రాష్ట్రపతి జన్మ దినోత్సవం

న్యూఢిల్లీ, డిసెంబర్ 2

భారత రక్షణ దళాల సర్వసైన్యాధిపతి అయిన రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ 75వ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత సైనిక దళాల అధిపతులు అభివందన సందేశాలను అంద జేశారు.

భారత ప్రధాన సైన్యాధిపతి శ్రీ తిమ్మయ్య, నావిక దళాధిపతి శ్రీ కరారి, వైమానిక దళాధిపతి శ్రీ ముఖర్జీలు తమ తమ దళాల తరఫున అభినందనలను తెలియ జేస్తూ సందేశాలను పంపారు.

రాజధానివార్తలు

జంటనగరాల ప్రజాసోషలిస్టు పార్టీ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ మోండా బజారు ధర్మశాలలో జరుగుతుంది. సమావేశానికి శ్రీ యస్. వి. గిరి అధ్యక్షత వహిస్తారు.

* * *

హైదరాబాద్ జిల్లా హిందీ ప్రచారక మండలి సాధారణ సభ్యుల సమావేశం నవంబర్ 25 సాయంత్రం శ్రీ మధుసూదన్ జీ చతుర్వేదీగారి అధ్యక్షతను జరిగినది. సమావేశమునకు 80 మంది ప్రచారకులు హాజరయ్యారు. మండలి కార్యదర్శి శ్రీ జేబూరి బలరామి రెడ్డిగారు మండలి స్థాపించబడిన నాటి నుంచిజరిగిన మండలి కార్యకలాపాలను వివరించారు. అనంతరం జిల్లా మండలి నుండి దక్షిణ భారత హిందీ ప్రచార సభ-ఆంధ్రకు ప్రతినిధుల ఎన్నిక జరిగినది. శ్రీయుతులు ఆర్. వినాయకరావు, అడుసుమిల్లి కృష్ణమూర్తి, రామ గోపాల శర్మ, యస్. వి. శివ రామశర్మ, చంద్రశేఖర శాస్త్రిగారలు ప్రతినిధులుగా ఎన్నుకొనబడిరి.

* * *

డాక్టర్ జయసూర్య షష్టిపూర్తి ఉత్సవాలు, ఆంధ్రప్రదేశ్ హోమియోపతి వైద్యుల మహాసభ ఏర్పాట్లసంఘం ఆదివారం సాయంత్రం 5 గంటలకు డాక్టర్ జయ సూర్య వైద్యశాలలో జరుగుతుంది.

* * *

భాగవతారిణి శ్రీమతి యస్. రాజకుమారి గత 28 వ తేదీ ఆంధ్ర యువతీమండలిలో 'శశిరేఖాపరిణయం' హరికథా కాలక్షేపం చేశారు. మండలి తరఫున వారికి రజితపాత్ర బహూకరణ జరిగింది. సికింద్రాబాద్ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో 'కీచక వధ' హరికథ చెప్పగా, అక్కడ నూట పదహార్లు యిచ్చి భాగవతారిణి గారిని సత్కరించారు.

* * *

ఆంధ్ర విద్యాలయపు బోధనాభ్యసన విద్యార్థి సంఘమువారి ఆహ్వానమునంగీకరించి హైదరాబాద్ రేడియో కేంద్రంలో నున్న శ్రీ ముని మాణిక్యం నరసింహారావు గారి యుపన్యాసము మంగళవారం సా॥ 5-30గంటలకుఏర్పాటు గావింపబడెను. ఉపాధ్యక్షులు శ్రీ నర్సింలు అతిథికి పూలమాల వేశారు.

శ్రీ బి. యస్. ఆర్. ఆంజనేయులు గారు శ్రీ నరసింహారావు గారిని పరిచయము గావించిరి. ఉపన్యాసకులు ఉపాధ్యాయ వృత్తిలోని కష్టములను, తమ యనుభవమును దృష్టియందుంచుకొని విశద పరచుచు సువాధ్యాయుడు ఎట్లు తన జీవితమును సుఖ ప్రద ముగావించుకొన వలెనో విశద పరచిరి.

విద్యార్థి సంఘ కార్యదర్శి ఎ. బాలకృష్ణయ్య వందన సమర్పణానంతరము అల్పాహార విందుతో సమావేశము పూర్తి అయ్యెను.

కల్వకుర్తి సమితి ఉపాధ్యాయ సంఘం

కల్వకుర్తి, డిసెంబర్ 3

కల్వకుర్తి సమితి ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘానికిరాష్ట్ర ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు శ్రీ ముత్తారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. సమితిలోని ఉపాధ్యాయులు చాలా మంది యీ ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీయుతులు పి. వి. రాఘవాచార్యులు, ముత్యాలు, ముకురాల రామిరెడ్డి గారలు కూడా ప్రసంగించారు.

ఈ సమితి ఉపాధ్యాయ సంఘానికి శ్రీయుతులు ముసలయ్య అధ్యక్షులు, జంగారెడ్డి ఉపాధ్యక్షులు, యస్. రంగారావు, పెంటారెడ్డి గారలు కార్యదర్శులు, మక్సూద్ అలీ కోశాధికారిగను ఎన్నికయ్యారు.

దుబ్బాక బ్లాకు ఎగ్జిబిషన్

దుబ్బాక, డిసెంబర్ 2

దుబ్బాక బ్లాకు పారిశ్రామిక వస్తు ప్రదర్శనం నవంబర్ 14 నుండి వారం రోజులు జరిగింది. సిద్దిపేట డిప్యూటీ కలెక్టర్ శ్రీ శంకరం ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవం చేశారు. బ్లాకు ప్రాంతంలోని 18 పారిశ్రామిక సహకార సంఘాలు, ప్రభుత్వ మత్స్య పరిశ్రమ శాఖ; తూకాలు, కొలతల డిపార్టుమెంటు వారు ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ నడిచిన వారం రోజులు నాటకాలు, బుర్ర కథలు, హరికథలు, విచిత్ర వేషధారణ లాంటి వైజ్ఞానిక కార్యక్రమాలను ప్రతిరోజూ వందలాది ప్రజలు వీక్షించారు.

రవీంద్ర పాటర్సు ఇండస్ట్రియల్ కోపరేటివ్ సొసైటీ వారికి ఎగ్జిబిషన్ స్టాల్సు అలంకరణలో ప్రథమ బహుమతి లభించింది. వైజ్ఞానిక కార్యక్రమాల నిర్వాహకులలో 8 వ తరగతి చదువుతున్న 10 సంవత్సరాల బాలుడు రంగాచారి హరికథ చెప్పినందుకు ప్రథమ బహుమతి యిచ్చారు.

ద్వితీయ ప్రణాళికకు కేంద్ర సహాయం

25 కోట్లు అవసరమని ఆర్థిక మంత్రి వివరణ

హైదరాబాద్, డిసెంబర్ 3

ద్వితీయ ప్రణాళికలోని ఆఖరు సంవత్సరం కార్యక్రమాల నిర్వహణకు సుమారు 25 కోట్ల రూపాయల కేంద్ర సహాయం అవసరమని ఆర్థిక మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నేడిక్కడ విలేఖరులతో మాట్లాడుతూ అన్నారు.

1960-61 సంవత్సరంలో ద్వితీయ ప్రణాళిక ఆఖరు సంవత్సరంలో-ప్రణాళికావ్యయం 44.04 కోట్ల రూపాయలు ఉంటుందనీ, రాష్ట్రపు ఆర్థిక వనరులు 19 కోట్ల రూపాయల మేరకు ఉంటాయనీ ఆయన వెల్లడించారు.

1959-60 సంవత్సరంలో కేంద్రం నుంచి 19 కోట్ల రూపాయలు లభించాయనీ, వచ్చే సంవత్సరం హెచ్చు మొత్తం సహాయంగా లభించగలదని తానాశిస్తున్నాననీ ఆయన అన్నారు.

ద్వితీయ ప్రణాళిక లక్ష్యం అయిన 175.74 కోట్ల వ్యయాన్ని పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషిచేస్తుందని ఆయన వెల్లడించారు.

శ్రీ రెడ్డి దక్షిణ మండల రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశంలో పాల్గొని నిన్ననే నగరానికి తిరిగి వచ్చారు.

దక్షిణ మండల రాష్ట్రాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన ఉమ్మడి కృషిఅవసరమని గుర్తించబడిందనీ, అందువల్లనే ఈ మండల రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశం జరిగిందనీ ఆయన అన్నారు

ఈ రాష్ట్రాల ఉమ్మడి సమస్యలను చర్చించడానికి అనేక సమావేశాలు జరగవచ్చునీ, వాటికి ఈ ఆర్థిక మంత్రుల సమావేశం నాందివంటిదనీ ఆయన అన్నారు.

దక్షిణాది రాష్ట్రాలు పారిశ్రామికంగా వెనుకబడి ఉన్నందున, ఈ విషయంలో వ్యష్టికృషికంటె సమిష్టి కృషి ఎక్కువ ఫలవంతము ఉంటుందనిగా ఆయన అన్నారు.

మద్రాసు సమావేశంలో ఆయా రాష్ట్రాలకు సంబంధించిన తృతీయప్రణాళికా సమస్యలపై చర్చలు జరిగాయని ఆయన వివరించారు.

సీతాఫలం గింజల వల్ల ప్రమాదం

హైదరాబాద్, డిసెంబర్ 3

సీతాఫలం గింజలను పిల్లలకు ఆడుకోవటానికి ఇవ్వటం చాలా ప్రమాదకరం ప్రమాదవశాత్తు అవి ఊపిరితిత్తులలోకి పోవచ్చును. ఇట్లా జరగటం వల్ల వైద్య సహాయం చక్కగా లభించినప్పటికీ కూడా ఫలితం వుండదు. కాబట్టి వాటిని పిల్లలు ముట్టకుండునట్లు చూడవలసిందిగా తల్లి దండ్రులను కోరడమవుతున్నది.

చేగూరులో మంత్రిరంగారెడ్డి జన్మదినోత్సవ సన్నాహాలు

హైదరాబాద్, డిసెంబర్ 1

చేగూరుగ్రామంలో రెవిన్యూ మంత్రి కొండా వెంకట రంగారెడ్డిగారి 70 వ జన్మదినోత్సవం జరపడానికి ఆ గ్రామంలోని "కౌన్సిల్ ఆఫ్ పబ్లిక్ ఒపినియన్" వారు నిశ్చయించారు.

అదే రోజు సహకార వ్యవసాయ సంఘానికి ప్రారంభోత్సవం జరుపుకుంటారట.

తిరుమలగిరిబజారుఆర్యవైశ్య యువజన సంఘం

హైదరాబాద్, డిసెంబర్ 3

తిరుమలగిరి బజారు ఆర్యవైశ్య యువజన సంఘానికి శ్రీ అకుల విశ్వనాథం గుప్త అధ్యక్షులు, లక్ష్మయ్య గుప్త ఉపాధ్యక్షులు, చిత్తరంజన్ గుప్త, భాస్కర గుప్త గారలు కార్యదర్శులు, గంగా కృష్ణమూర్తి గుప్త కోశాధికారిగను ఎన్నికయ్యారు. గ్రంథాలయ నిర్వాహకులుగ హనుమంతరావు, దయానంద గుప్తగారలు, వ్యాయామశాల నిర్వాహకులుగ కొత్తరాములు గుప్త, శిద్దం శెట్టికైలాసం గుప్తగారలు ఎన్నికయ్యారు. పై ఎన్నికల సమావేశం నవంబర్ 29వ తేదీన శ్రీ వై. చంద్రమౌళి గుప్త అధ్యక్షతన జరిగినది.

"వైదిక్ నగర్"

హైదరాబాద్, డిసెంబర్ 3

సికింద్రాబాద్ మునిసిపల్ హద్దులలోని "హిమ్మత్ నగర్" ప్రాంతంపేరు "వైదిక్ నగర్" అని మార్చబడినట్లు ప్రకటించడ మవుతున్నది.

సుడాన్‌లో ప్రయాణాలపై ఆంక్షలు

ఖార్టూమ్, డిసెంబర్ 2

ప్రభుత్వానుమతి లేకుండా సుడాన్ పౌరులు దేశాన్ని విడచి వెళ్ళడాన్ని నిషేధించే బిల్లు మంత్రి మండలి ఆమోదం పొంది అమలు చేయబడినట్లు సూడాన్ దేశీయ శాఖా మంత్రి ఎ. యమ్. బహరీ నేడు వెల్లడించారు.

యూనివర్శిటీ సిబ్బందికి కరువు భత్యం

హైదరాబాద్, డిసెంబర్ 3

యూనివర్శిటీ సిబ్బందికి నెలకు 6 రూపాయలు కరువు భత్యం పెంచడానికి యూనివర్శిటీ అధికారులు అంగీకరించారు. దీని ఫలితంగా గత ఆరు రోజుల నుండి నిరసనవ్రతం చేస్తున్న యూనివర్శిటీ సిబ్బంది సంఘ కార్యదర్శి శ్రీ షహబుద్దీన్ తమ నిరసనవ్రతాన్ని విరమించారు.

యూనివర్శిటీ వైస్ ఛాన్సెలర్ శ్రీ డి. యస్. రెడ్డిగారిచ్చిన నిమ్మపండ్ల రసాన్ని త్రాగడంతో వీరి నిరసన వ్రత విరమణ జరిగినది.

సర్వోదయ విశిష్టత

శ్రీ శంకరరావ్ దేవ్ వివరణ

హైదరాబాద్, డిసెంబర్ 4

గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాధించడమే సర్వోదయ ఉద్యమ మూల తత్వమని శ్రీ శంకరరావ్ దేవ్ గురువారంనాడు యిక్కడ పత్రికా గోష్ఠిలో అన్నారు. సర్వోదయ ఉద్యమానికి రాజకీయాలతో సంబంధం లేకపోలేదంటూ, ప్రభుత్వ యంత్రాంగంలోనించి ఉత్పన్నమయ్యే ప్రాబల్య రాజకీయాలు, అధికార రాజకీయాలు గాక, జనశక్తి ఆధారంగా ఉత్పన్నమయ్యే ప్రజా రాజకీయాలు సర్వోదయ రాజకీయాలకు ప్రాతిపదిక అనీ, అందువల్లనే అధికారం చేజిక్కించుకోవాలనే ఆశ సర్వోదయంలో లేదనీ శ్రీ దేవ్ అన్నారు.

స్వతంత్ర పార్టీని గురించి ప్రశ్నించగా 'కేవలం రాజకీయ పార్టీల సంఖ్య పెరిగినంత మాత్రాన ప్రజల సమస్యలు పరిష్కారం గావనీ, క్షణ క్షణం గొప్ప మార్పులు సంభవిస్తూ, దేశపటాలే మారిపోతూన్న ఈ రోజుల్లో రాజకీయ పార్టీల అవసరమే చాలా తక్కువనీ, రాజకీయపార్టీ పాతకాలపు అవశిష్టమే కాగలదనీ అన్నారు. 'పంచశీల' సూత్రాల నంగీకరించినవైనా దౌర్జన్యానికి దిగడం చాలా శోచనీయమని శ్రీ దేవ్ చైనా వైఖరిని విమర్శించారు.

తర్వాత గాంధీ భవనంలో జరిగిన సర్వోదయ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తూ, గ్రామ స్వరాజ్య నిర్మాణానికి మూల సాధనగా ఖాదీ రూపొందాలన్నారు.

ఖాదీ ఉత్పత్తి పెరిగిన మాట వాస్తవమే అయినా, ఖాదీ తత్వం వ్యాపించనందుకు శ్రీ శంకరరావ్ దేవ్ విచారాన్ని వెలిబుచ్చారు.

రోడ్డు రవాణా సిబ్బంది సంఘం

హైదరాబాద్, డిసెంబర్ 4

ఐ. యన్. టి. యు. సి కి అనుబంధంగా వున్న ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా కార్పొరేషన్ సిబ్బంది సంఘానికి శ్రీ ఇంద్రపాల్ సింగ్ అధ్యక్షులుగ బుధవారం నాడు ఎన్నికయ్యారు ఉపాధ్యక్షులుగ శ్రీయుతులు యం పి. జాన్, యం. ఏ. రషీద్, కె. మనుసూధనరావు, సయ్యద్ హుస్సేన్, కె.యస్. ఆర్. చార్లు, పి. రామస్వామి గారలు ఎన్నికయ్యారు. శ్రీ యస్. పూర్ణచంద్రరావు ప్రధాన కార్యదర్శిగాను టి. ఈశ్వరయ్య, సి. డి. ఛార్లెస్ గారలు సహాయ కార్యదర్శులుగను, యం. ఏ. రహీం ఆర్గనైజింగ్ కార్యదర్శిగను, టి. యల్. బలరాంగారు కోశాధికారిగను ఎన్నికయ్యారు.

ఎన్నికలకు ముందు ఐ. యన్. టి. యు. సి అధ్యక్షులు శ్రీ జి. సంజీవరెడ్డి సభలో ప్రసంగిస్తూ కమ్యూనిస్టులకు దోహదమిస్తున్న కార్పొరేషన్ యజమానుల చర్యలను నిశితంగా విమర్శించి, ఐ. యన్. టి. యు. సి. కి అనుబంధంగా వుంటున్న యీ కార్మిక సంఘాన్ని గుర్తించాలని కోరారు.

హైదరాబాద్, డిసెంబర్ 3

సిట్పూర్, కాగజ్‌నగర్ సిర్‌సిల్క్ లిమిటెడ్ యజమానులకీ, పనివారలకీ మధ్య ఏర్పడిన పారిశ్రామిక వివాదం పరిష్కారార్థం హైదరాబాద్‌లోని పారిశ్రామిక ట్రిబ్యునల్‌కు నివేదించబడింది. పనివారలు లాకౌట్ జరిగిన కాలానికి వేతనాలు కోరడం విషయంలో యీ వివాదం ఏర్పడింది.

నిజామాబాద్ జిల్లా పరిషత్తు ప్రారంభోత్సవం

నిజామాబాద్, డిసెంబర్ 4

నిజామాబాద్ జిల్లా పరిషత్తు ధర్మదాయాల మంత్రి శ్రీ ఎ. భగవంతరావుగారు మంగళవారంనాడు ప్రారంభోత్సవం జరిపారు. ఈ సందర్భంలో జరిగిన సభలో జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ హనుమంతరెడ్డి, జిల్లా కలెక్టర్ నారాయణరెట్టిగారలు కూడా ప్రసంగించారు. జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షులు శ్రీ లింగయ్యగుప్త వందన సమర్పణతో సభ ముగిసినది. సభానంతరం వైజ్ఞానిక ప్రదర్శనలు జరిగాయి.

కమ్యూనిస్టులతో తెగతెంపులు

రాష్ట్రీయ రైల్వే షాహుకారి హమాలీ యూనియన్ చే

నిజామాబాద్, డిసెంబర్ 3

రాష్ట్రీయ రైల్వే షాహుకారీ హమాలీ యూనియన్ (నిజామాబాద్) సర్వసభ్య సమావేశం నిన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కె.వి. గంగాధర్ అధ్యక్షతన సమావేశమై, కమ్యూనిస్టు ట్రేడ్ యూనియన్‌తో తెగతెంపులు చేసుకొని తమ సంఘాన్ని ఐ. ఎన్. టి. యు. సి. కి అనుబంధం చేయడానికి తీర్మానించారు.

నూతన సంవత్సరానికి శ్రీయుతులు ఎస్. నారాయణ అధ్యక్షులు, రాజు కార్యదర్శి, రాములు కోశాధికారిగను ఎన్నుకున్నారు.

వక్తృత్వ పోటీలు

పరిషత్తు ప్రారంభోత్సవం సందర్భంగా

మహబూబ్‌నగర్, డిసెంబర్ 2

మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్తు ప్రారంభోత్సవం సందర్భంగా పట్టణంలోని వివిధ హైస్కూలు విద్యార్థుల మధ్య వక్తృత్వ పోటీ నిర్వహింపబడింది. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన 18 మంది విద్యార్థులు యీ పోటీలో పాల్గొన్నారు. నేటి భారత దేశ పరిస్థితులలో, ప్రజాస్వామిక అధికార వికేంద్రీకరణం' అనే విషయంపై వక్తృత్వ పోటీ నిర్వహింపగా, యస్. విశ్వయ్య ప్రథములుగాను, పార్థసారథి ద్వితీయుడుగాను నెగ్గారు. విద్యార్థినులలో కుమారి రాధ ప్రథములుగాను, కుమారి తులసి ద్వితీయురాలుగాను పోటీలో నెగ్గారు

ఈ జిల్లా పరిషత్తుకు హోం మంత్రి మందుముల నరసింగరావుగారు ప్రారంభోత్సవం చేశారు.

ధరవరలు

కొత్తూరు సీతయ్య గుప్త

ఉస్మాన్ గంజ్, హైదరాబాద్ ఆం.ప్ర.

ఫోన్: నెం. 4255

శుక్రవారం, 4-12-59

సన్న బియ్యము	73-0-0	86-0-0
దొడ్డు బియ్యము	54-0-0	56-0-0
అక్కుల్లు బి॥	56-0-0	59-0-0
19 నెం. బియ్యము	56-0-0	60-0-0
గొట్టె బియ్యము	58-0-0	---
24 నెంబర్	78-0-0	81-0-0
యస్. కె.కె. ,,	76-0-0	78-0-0
కుసుమ బియ్యము	71-0-0	72-0-0
తెల్ల జొన్నలు	50-0-0	52-0-0
చట్టి ,,	39-0-0	42-0-0
పచ్చ ,,	39-0-0	40-12-0
పసుపు	95-0-0	130-0-0
కందులు	50-0-0	52-0-0
ఎర్ర కందులు చి॥	38-0-0	48-0-0
పెసలు	47-0-0	50-0-0
మినుములు	49-0-0	51-0-0
శనగలు	42-0-0	---
ఉలవలు	38-0-0	---
బెల్లము	60-0-0	70-0-0
మిర్చి	160-0-0	290-0-0
చింతపండు	160-0-0	205-0-0
ఉల్లిగడ్డ	20-0-0	27-0-0
గోధుమలు	84-0-0	92-0-0
కుసుమలు	52-0-0	54-0-0
నువ్వులు	95-0-0	100-0-0
ఇలాతిపలుకు చి॥	60-0-0	62-0-0
ఇలాతిపలుకు పె॥	80-0-0	85-0-0
ఆముదాలు	65-0-0	66-0-0
పత్తిగింజలు	37-0-0	40-8-0
నూనె	16-10-0	---
కందిపప్పు పె॥	80-0-0	84-0-0
కందిపప్పు చి॥	74-0-0	82-0-0
మినప పప్పు	70-0-0	72-8-0
పెసర పప్పు	70-0-0	72-8-0
శనగ పప్పు	46-0-0	49-0-0
సిరిశనగ పప్పు	78-0-0	80-0-0
లంక పప్పు	50-0-0	52-0-0
ధనియాలు	122-13-0	---
ఇలాతికాయ	54-0-0	55-0-0

వచ్చే సంవత్సరంలో వెయ్యి సమాజ రేడియో సెట్లు నెలకొల్పడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనికిగాను 468 వేలు కేటాయింపు జరిగినది.



మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమార్థం
పతాక దినంనాడు
(డిసెంబరు 7)
ఇతోధికంగా విరాళాలు ఇవ్వండి

దగ్గవద్దు!
జెఫ్‌రాల్ సేవించండి ఇది తక్షణం నివారించును
'ZEPHROL' trade mark brand
జెఫ్‌రాల్ కాఫ్ సిరప్
మే అండ్ బేకర్ లిమిటెడ్
డిస్ట్రిబ్యూటర్లు మే అండ్ బేకర్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
బొంబాయి • కలకత్తా • గౌహతి • మద్రాసు • న్యూ ఢిల్లీ

మీ బిడ్డకు మేలైనది
స్పెన్సర్స్ గ్రైప్ సిరప్
పసిపిల్లలకువచ్చే అన్నివిధములైన రోగములకు.
-:ఆంధ్ర రాష్ట్రానికి సోల్ డిస్ట్రిబ్యూటర్లు:-
ది స్వతంత్ర ఏజన్సీస్
రామ్ విహారు, హనుమాన్ పేట, విజయవాడ-2.
SC-18-SA

నేడే చూడండి! నేడే చూడండి!!
ఆలుమగలు
తారాగణం: జగ్గయ్య, జానకి, గిరిజ, రమణారెడ్డి
కమల్-హైదరాబాద్ చిత్ర-సికిందరాబాద్ రామా-వరంగల్
ఆటల సమయాలు: 2-30, 6-00, 9-30
- ప్రభాత్ పిక్చర్స్ రిలీజ్ -

టెండరు నోటీసు

సకాలములో యీ సంవత్సరము తయారైన, శుభ్రమైన మంచి గడ్డి 18 లక్షల పౌనులు ఒకే లాటుగానైనా లేక 2 లక్షల పౌనులు ప్రతి నెలలోను, మిగిలినది మార్చి నెల1960లో పశుపాల కేంద్రము- రాజేంద్ర నగరునకు సప్లయి చేయవలయును కాపున సీలువేసిన టెండర్లు శాంపుల్సుతో సహా డైరెక్టరు, పశు సంవర్ధన శాఖ, హైదరాబాద్ అని వ్రాసి, సూపర్నెంటు, పశుపాల కేంద్రము రాజేంద్ర నగరునకు పంప వలయును. ప్రతి టెండరునకు రు. 100/-డిపాజిట్టు కట్టవలయును. దరఖాస్తు ఫారములు ఒక రూపాయి చెల్లించి సూపర్నెంటు, పశుపాల కేంద్రము రాజేంద్ర నగరు నుండి పొందవచ్చును. దరఖాస్తులు 10-12-59 సాయంత్రం 2.గం లోపల చేరవలయును. 1000పౌనుల కుధర వ్రాయవలయును.

సూపర్నెంటు,
పశుపాల కేంద్రము, రాజేంద్ర నగరు.

17 వ సంయుక్త వారం!
శ్రీ వెంకట రమణా ఫిల్మ్స్ వారి
బాల నాగమ్మ
అంజలి, ఎన్. టి. రామారావు, రాజసులోచన, రంగారావు, రేలంగి
రీగల్ రమేష్ శ్రీకృష్ణా ప్రేమ్
హైదరాబాద్ నిజామాబాద్ సూర్యాపేట నల్లగొండ
[Nima] — శ్రీ నేషనల్ ఆర్ట్ పిక్చర్స్ రిలీజ్ —

8 వ సంయుక్త వారం!
సాహితీ ఆర్ట్ వారి
బండ రాముడు
సెలెక్ట్ బొలారం ప్రభాత్ నిజామాబాద్
తర్వాత చిత్రం
రీగల్ రాహత్ భారత్
ఖైరతాబాద్ హైదరాబాద్ మహబూబ్‌నగర్
(Nima) — పూర్ణా రిలీజ్ —

12వ సంయుక్త వారం!
ఈగల్ ఫిలిమ్స్ వారి
ఉజాలా
మాలాసిన్హా, సచ్చిదానంద్, రాజ్‌కపూర్, కుమకుమ్, ఘూమాల్, లీలా చిట్నీస్.
సంగీతం: శంకర్ జైకిషన్
రాయల్ అలంకార్ లక్ష్మి
హైదరాబాద్ సికింద్రాబాద్ వరంగల్
ఆటల సమయాలు: 3-30, 6-30, 9-30.
(Trupix) - మహేశ్వరి పిక్చర్స్ విడుదల -

భారత ప్రభుత్వ రుణ సేకరణ విధానం

మొరార్జీ సమర్థన

న్యూఢిల్లీ, డిసెంబర్ 3

పరతులు లేకుండా అన్ని మిత్ర దేశాల నుంచి ఆర్థిక సహాయం స్వీకరించే భారత ప్రభుత్వ విధానాన్ని రాజ్య సభలో శ్రీ మొరార్జీదేశాయ్ నేడు సమర్థించారు. ఏ వెనుకబడిన దేశం కూడా తన స్వశక్తితో అభివృద్ధి చెందలేదు'' అని ఆయన అన్నారు.

''అది ప్రపంచ చరిత్రలో లేని విషయం'' అని కూడా శ్రీ మొరార్జీ అన్నారు. తమ విదేశ పర్యటనపై సభలో జరిగిన రెండు గంటల చర్చపై ప్రకటన చేస్తున్న సమయంలో శ్రీ మొరార్జీ పై విధంగా అన్నారు.

పరతులు విధించి ఇచ్చే సహాయాన్ని ఇండియా స్వీకరించిందని, అయితే ఇంతవరకు ఏ మిత్ర దేశం కూడా తామిచ్చిన సహాయానికి పరతులు విధించటానికి ప్రయత్నించక పోవటం సంతోషకరిన విషయమనీ ఆయన అన్నారు.

ఈ విషయంపై చర్చ లేవనెత్తిన సమ్యూనిస్టు సభ్యుడు శ్రీ భూపేష్ గుప్త మినహా యితర సభ్యులందరూ కూడా విదేశాల నుంచి ఆర్థిక సహాయం తీసుకోవటాన్ని సమర్థించారు.

ప్రభుత్వం ''నిర్లక్ష్యంగా పెద్దమొత్తాలను అప్పులు'' తీసుకుంటున్నదని శ్రీ భూపేష్ గుప్త ఆరోపించారు.

తమ విదేశ పర్యటన లక్ష్యం కామన్వెల్త్ ఆర్థిక మంత్రుల సమావేశం లోను, ప్రపంచ బ్యాంక్ సమావేశం లోను పాల్గొనటమే కాని ఋణ సేకరణ కాదని శ్రీ మొరార్జీ మరోసారి వివరించారు.

జవుళి మిల్లు పనివారి సత్యాగ్రహం

మూతబడిన మిల్లులో పని ప్రారంభించాలని

రాయపూర్, డిసెంబర్ 3

బెంగాల్ నాగపూర్ జవుళి మిల్లును వెంటనే ప్రారంభించవలసిందిగా కోరుతూ సబ్ డివిజనల్ ఆఫీసర్ కోర్టు వద్ద సత్యాగ్రహం చేస్తున్న ఆరుగురు ప్రజా సోషలిస్టు కార్యకర్తలను పోలీసులు నేడు అరెస్టు చేశారు. ఈ ప్రజా సోషలిస్టు అధ్వర్యాన నడుస్తున్న రాజనందగామ్ యర్ర జండా కార్మిక సంఘం వారు ఈ సత్యాగ్రహాన్ని తలపెట్టారు శ్రీ మదన్‌లాల్ తివారీ నాయకత్వాన సత్యాగ్రహం చేస్తున్న 24 మంది సత్యాగ్రహుల కేసులను అక్కడి కక్కడే విచారించి, ఒక్కొక్కరికి నెల రోజులు ఖైదు, 25 రూపాయలు జరిమానా విధించారు. ఇతరులను వ్యాను లలో ఎక్కించుకొని 15 మైళ్ళ దూరం లో దింపేశారు.

నష్టం వస్తున్నదనే కారణంతో యీ మిల్లు యజమానులు సెప్టెంబర్ 1 వ తేదీన మిల్లును మూసివేశారు. ఈ మిల్లులో తిరిగి పని ప్రారంభించడానికి తగు మార్గోపాయములు సూచించవలసిందిగా కేంద్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో లోగడనే ఒక కమిటీని నియమించింది.

సత్యాగ్రహం ప్రారంభించడానికి ముందు కార్మికులు మిల్లులో వెంటనే పని ప్రారంభించాలనీ, కార్మికుల వేతనాలు తగ్గించరాదనీ నినాదాలుచేస్తూ, ఊరేగింపు జరిపారు.

కాగితం ధరల తగ్గింపు

ప్రభుత్వ ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబర్ 4

సుమారు 24 రకాల కాగితం కాగితం లట్టలను తగ్గించాలని టారిఫ్ కమిషన్ చేసిన సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించింది. నూతన ధరలు వచ్చే నవంబరు మొదటి తేదీ నుంచి అమలులోకి వస్తాయి. వివిధ రకాలైన కాగితాలకు ప్రభుత్వం వేరువేరైన ధరలను కూడా నిర్ణయించింది.

దేశంలో పెరిగిపోతున్న కాగితం అవసరాలను తీర్చడానికి కూడా కమిషన్ కొన్ని సూచనలను చేసింది. కాగితాల సంపత్తి విధానాన్ని కట్టుదిట్టం చెయ్యాలనీ, ధరలను అదుపుచెయ్యాలనీ కమిషన్ సూచించింది. 1958 నాటికి పత్రికల కాగితంతోక మిగిలిన రకాల కాగితం 520 వేల టన్నులు అవసరం ఉంటుందని అంచనా వేయబడింది.

దేశంలో కాగితం పరిశ్రమ అభివృద్ధికి టారిఫ్ కమిషన్ కొన్ని సూచనలను కూడా చేసింది. అటవీ ప్రాంతాలకు కాగితాల మిల్లులకు దీర్ఘకాలిక కౌళ్ళు ఇవ్వాలనీ, కాగితం గుజ్జును తయారు చెయ్యడానికి ప్రత్యేకమైన కర్మాగారాన్ని స్థాపించి, ప్రభుత్వ శాఖల నుంచి నిత్యకాగితాలను నేరుగా ఆ కర్మాగారానికి పంపాలనీ కమిషన్ సూచించింది. కాగితం ఉత్పత్తిదార్లు సమర్థులైన పర్యవేక్షకవిభాగాన్ని కలిగియుండాలనీ, కాగితం పంపిణీ, ధరలు మొదలైన విషయాలలో సంఘ విద్రోహశక్తుల చర్యలను అరికట్టడం కమిషన్ పనిలో ఉన్నది.

ఉస్మానియా విశ్వవిద్యాలయం:

బి. ఇ. పరీక్షా ఫలితాలు

హైద్రాబాద్, డిసెంబర్ 4

ఉస్మానియా విశ్వవిద్యాలయం గత సెప్టెంబర్ నెలలో నిర్వహించిన బి.ఇ. (సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, మైనింగ్) పరీక్షలలో ఈ క్రిందివారు ఉత్తీర్ణులైనారు:

బి.ఇ. I (కొత్త రూల్సు)

ఉత్తీర్ణులు:

4 6 14 15 18 19 21 22 28 29 30 31 37 39 40 41 42 53 55 58 60 61 62 అండ్ 65.

పరీక్ష పూర్తిచేసిన వారు:

68 70 71 73 75 77 79 80 81 85 86 88 89 90 91 92 93 94 95 96 97 98 99 100 101 102 104 105 106 107 108 109 110 111 112 113 114 115 116 119 120 121 122 123 124 125 126 127 128 అండ్ 129.

ఈ క్రిందివారు దిగువ పేర్కొన్న సబ్జెక్టులలో పరీక్ష తప్పారు:

సబ్జెక్టు	నెంబర్
ఇంగ్లీషు	13 27 28 34.
లెక్కలు I	43.
లెక్కలు II	24 33.
అప్లైడ్ ఫిజిక్సు అండ్ కెమిస్ట్రీ	2 20 25 57.
సర్వేయింగ్ (ప్రాక్టికల్)	9 54 59 66.
డ్రాయింగ్ I	12 49 56.

బి.ఇ. I (పాత రూల్సు)

ఉత్తీర్ణులు:

133 అండ్ 145.

పరీక్ష పూర్తిచేసిన వారు:

146 147 148 149 150 151 152 153 154 155 156 157 158 అండ్ 277.

131వ నెంబర్ విద్యార్థి ''ఎలిమెంట్స్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్'' అనే సబ్జెక్టులోను, 132 నెంబర్ విద్యార్థి ''వర్క్‌షాప్ ప్రాక్టిస్ ప్రాక్టికల్'' లోను పరీక్ష తప్పారు.

బి. ఇ. II (సివిల్)

ఉత్తీర్ణులు:

159 161 162 164 166 167 అండ్ 168.

పరీక్ష పూర్తి చేసినవారు:

170 171 172 173 174 175 176 177 178 179 180 181 అండ్ 182.

168 నెంబర్ విద్యార్థి ఫ్యూర్ అండ్ అప్లైడ్ మాథమెటిక్స్ లోను, 165, 169 నెంబర్లు గల విద్యార్థులు ''ఇరిగేషన్'' అనే సబ్జెక్టులోను పరీక్ష తప్పారు.

బి. ఇ. II [ఎలెక్ట్రికల్]

ఉత్తీర్ణులు:

183 184 185 186 187 188 190 191 192 193 194 195 196 199 అండ్ 200.

పరీక్ష పూర్తి చేసినవారు:

201 202 203 204 205 206 207 208 210 211 212 213.

197 నెంబర్ విద్యార్థి ''ఎలక్ట్రికల్ మెజర్ మెంట్స్'' అనే సబ్జెక్టులో పరీక్ష తప్పాడు.

బి. ఇ. II [మెకానికల్]

ఉత్తీర్ణులు:

214 216 217 221 222 అండ్ 276.

పరీక్ష పూర్తి చేసినవారు:

223 224 225 226 227 228 229 230 231 232 233 234 235 237 238 అండ్ 239.

239 నెంబర్ విద్యార్థి ''థియరీ ఆఫ్ మెషీన్'' అనే సబ్జెక్టులో ఉత్తీర్ణుడైనాడు.

212 నంబర్ విద్యార్థి ''ఫ్యూర్ అండ్ అప్లైడ్ మాథమెటిక్స్'' అనే సబ్జెక్టులోను, 215 నెంబర్ విద్యార్థి ''ఎలక్ట్రికల్ మెషినరీ'' అనే సబ్జెక్టులోను పరీక్ష తప్పారు.

బి. ఇ. III [సివిల్]

ద్వితీయ శ్రేణి:

240 242 247 249 251 253 255 257.

బి. ఇ. III [ఎలెక్ట్రికల్]

ద్వితీయ శ్రేణి:

258 259 260 261 262 263 264 265

266 నెంబర్ విద్యార్థి ఎలెక్ట్రికల్ పవర్ II అనే సబ్జెక్టులో ఉత్తీర్ణుడైనాడు.

బి. ఇ. III [మెకానికల్]

ద్వితీయ శ్రేణి:

267 268

బి. ఇ. III (మైనింగ్)

269 నెంబర్ విద్యార్థి ఉత్తీర్ణుడైనాడు.

పరీక్ష పూర్తి చేసిన వారు:

270 271 272 273 274 275.

కాలింపాంగ్‌లో చైనీస్ సంఖ్య పెరుగుదల

రాజ్యసభలో హోంమంత్రి వివరణ

న్యూఢిల్లీ, డిసెంబర్ 3

గత సంవత్సరం కంటే ఈ సంవత్సరంలో కాలింపాంగ్‌లో ఉన్న చైనా వారి సంఖ్య పెరిగినట్లు హోం మంత్రి శ్రీ పంత్ నేడు రాజ్యసభలో వివరించారు. కాలింపాంగ్‌లో ఉండదలచిన విదేశీయులు నిర్బంధంగా అనుమతి పత్రాలను పొందాలన్న సూచన అమలు చేయబడినట్లు ఆయన వెల్లడించారు. టెంగాలులో ఉన్న చైనా జాతీయులు పరి వివరాలూ సేకరించబడుతున్నాయనీ, ఇతర రాష్ట్రాలలో వారి సంఖ్య స్వల్పంగా ఉందనీ ఆయన వెల్లడించారు.

శ్రీ విశ్వచంద్రమిశ్రా అడిగిన ప్రశ్నకు సమాధానం చెపుతూ 1959 అక్టోబర్ 31 నాటికి మన దేశంలో 11,942 మంది చైనా వారున్నారనీ, వీరందరి అనుమతి పత్రాల విషయం పరిశీలించబడుతున్నదనీఆయనఅన్నారు.

ఈ చైనా వారంతా విద్రోహకర ప్రచారాన్ని సాగించడం లేదని శ్రీపంత్ సంతృప్తిపడిందా అని శ్రీ శివరావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ విషయాన్ని చెప్పడం కష్టమనీ, ఈ దేశం చైనా వారికి ఆశ్రయం ఇచ్చినందు వల్ల అటువంటి ప్రచారం చెయ్యడానికి వారు పూనుకొనరనే తాను ఆశిస్తున్నాననీ శ్రీ పంత్ అన్నారు.

రాజ్యాంగ సవరణ ఓటమికి కారణాలు

కాంగ్రెస్ పార్టీ పరిశీలన

న్యూఢిల్లీ, డిసెంబర్ 3

లోక్ సభలో రాజ్యాంగ సవరణ బిల్లులో ఆంధ్ర ఇండియన్ రిజర్వేషన్‌కు సంబంధించిన క్లాజు ఓడిపోయిన మీదట, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీకి బాధ్యులెవరనే విచారణ జరుపనున్నది. ఎంతో అవసర పరిస్థితి ఏర్పడితే తప్ప 'మూడు పంక్తుల ఆదేశం' సభ్యులకు ఇవ్వడం జరగదట. అలాంటి ఆదేశంయిచ్చిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఊళ్లోనే ఉండి, సమావేశాలకు హాజరుగాక పోవడం చాలా విస్మయమైన విషయంగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

ఈ విషయమై ఊళ్లో వుంటూనే ఆ నాటి లోక్‌సభకు గైర్‌హాజరైనవారి సంజాయిషీలను పార్టీ నాయకులు పరిశీలిస్తారట. ఈ విషయం త్వరలో జరిగే పార్టీ సమావేశంలో గూడా ప్రస్తావనకు రాగలదట. లోక్ సభలో కాంగ్రెస్ పార్టీ సభ్యులు 371 మంది ఉండగా ఆనాడు సవరణ వెగ్గడానికి అవసరమైన 258 మంది గూడా సభకు కాలేక పోవడం వల్ల ఆ ఒక్క సవరణ మాత్రం వీగిపోయింది.

లడక్ సరిహద్దు సమస్య

(1 వ పేజీ తరువాయి)

టనలలో దురుక్కున్న అవకాశాన్ని సురాక్రమణపై ఆధారపడిన తన కోర్కెల సాధనకు వినియోగించుకోవచ్చునేమోనని ఆయన విమర్శించారు.

పాకిస్తాన్ తన లేఖలో పల్లడించిన వాదాన్ని అంగీకరించడం జరిగితే చైనాను ఎంత మాత్రం అడ్డు పెట్టకుండా కాశ్మీర్ ప్రాంతాన్ని ఆక్రమించుకోనివ్వవలసి వస్తుందనీ, దానివల్ల ఇండియా భద్రతకూ, ప్రపంచ శాంతికీ ముప్పు కలుగుతుందనీ ఆయన వివరించారు.

సరిహద్దు సమస్య పట్ల ఆసక్తినిచూపే వారందరికీ పాకిస్తాన్ లేఖ అసంతృప్తిగా ఉందన్న విషయం బోధపడుతుందని ఆయన విమర్శించారు.

హెల్త్ ఇనస్పెక్టర్ల పరీక్షలు

ప్రభుత్వ ప్రకటన

హైద్రాబాద్, డిసెంబర్ 3

పూర్వ హైద్రాబాద్ రాష్ట్రపు హెల్త్ ఇనస్పెక్టర్ల కోర్సు పరీక్షలో తప్పినట్టి తెలంగాణా అభ్యర్థుల ప్రయోజనార్థం 1959 డిసెంబర్ నెలలో హెల్త్ ఇనస్పెక్టర్ల కోర్సు అనుబంధ పరీక్ష జరుపబడుతుంది. ఈ పరీక్షకు కూర్చొన దరఖాస్తులవారు దరఖాస్తులను, హైద్రాబాద్‌లో సుల్తాన్ బజారులోని ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ కార్యాలయంలో 1959 డిసెంబర్ 16వ తేదీ సాయంకాలం 5 గంటల వరకు అందజేయవలెను.

అభ్యర్థులు, పరీక్ష ఫీజు రూ. 8.50 ల ముద్రాంకితాన్ని ఏదైనా ప్రభుత్వ ట్రెజరీలోగానీ, లేదా హైద్రాబాద్ స్టేట్ బ్యాంకులో గాని ''మేజర్ హెడ్ XXVIII పబ్లిక్ హెల్త్, మైనర్ హెడ్ మునిసిపలియన్ పబ్లిక్యులర్స్ పూర్వ హైద్రాబాద్ ప్రభుత్వపు హెల్త్ ఇనస్పెక్టర్ల పరీక్ష ఫీజు, డిసెంబర్ 1959'' అనే పద్దుకు చెల్లించవలెను. డబ్బు చెల్లించి పొందిన చలానాను దరఖాస్తుతో ఎటాచ్ చేయవలెను. 1959 డిసెంబర్ 15 వ తేదీ తరువాత వచ్చే దరఖాస్తులు పరిశీలింపబడవు.

మంగలపాడు పాఠశాల

నిజామాబాద్, డిసెంబర్ 3

మంగలపాడు గ్రామంలో పాఠశాల భవనానికి ధర్మదాయాల మంత్రి శ్రీ భగవంతరావు ప్రారంభోత్సవం చేశారు. దీనికి ముందు నిజామాబాద్‌లోని ఇంటి భవనాన్ని మంత్రిగారు సందర్శించారు. భవనంవద్ద శ్రీమతి ఎల్లా ప్రమీలతాకుమారి, జి. కృష్ణమూర్తిగారలు మంత్రిగారికిస్వాగతపత్రంసమర్పించారు.

Edited by K. S. Subrahmanyam, published by Smt. Sita Yudhvir, and printed at the Janatha Trust Press, Gandhi Bhavan, Mukaramjahi Road, Hyderabad.

విదేశీయాత్రికులకు అతిథి మర్యాదలు

గవర్నర్ సచార్ ఉద్బోధ

హైదరాబాద్, డిసెంబర్ 3

భారత దేశం వచ్చే విదేశీ యాత్రికులకు అతిథి మర్యాదల లోపం రానీయకుండా, వారి యెడ ఉదాత్తంగా ప్రవర్తించాలని ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ నేడు ఆలిండియా రేడియో హైద్రాబాద్ కేంద్రం నుండి ప్రసంగించారు.

ప్రపంచం రెండు కూటములుగా చీలిన యీ రోజులలో ఇండియా ఏ కూటములోనూ చేరక అన్ని దేశాల గౌరవ, మర్యాదలను అందుకుంటున్నదన్నారు. ఆత్మ పునురుజ్జీవనాన్ని సాధించడానికి పోరాడుతున్న గొప్ప ప్రజాస్వామిక దేశం ఇండియాను సందర్శించడానికి అన్ని దేశాల వారు వస్తుంటారు. మన అతిథి మర్యాదలను ఫాహియాన్, హియన్‌సాంగ్ లాంటి విఖ్యాత యాత్రికులు శతాబ్దాల క్రితమే శ్లాఘించారు. ఈ ఉత్తమ జాతీయ లక్షణాన్ని మనం విడనాడరాదని వారు ఉద్బోధించారు. యాత్రికులను స్వప్రయోజకులు దోచుకు తిన జూస్తారు.ఇది తగదనీ, అది దేశానికే అప్రతిష్టాకరమనీ వారన్నారు.

పతాక దినోత్సవం

విరాళాలకై గవర్నర్ విజ్ఞప్తి

హైద్రాబాద్, డిసెంబర్ 3

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ భీమ్‌సేన్ సచార్ 1959 డిసెంబర్ 7వ తేదీన పతాక దినోత్సవం సందర్భంగా ఈ క్రింది విజ్ఞప్తి చేస్తున్నారు:

పతాక దినోత్సవం మనకందరికీ పరిచయమైనదే. అది ప్రతి సంవత్సరం డిసెంబర్ 7వ తేదీన జరుగుతూ వుంటుంది. ఆనాడు మాజీ సైనికులకూ, వారిపై ఆధారపడివున్న వారికీ, సాయుధ దళాలలో పనిచేస్తున్నవారికి శ్రేయస్సును చేకూర్చడానికై చందాలూ, విరాళాలు సేకరించ బడుతూ వుంటాయి. ఈ దినోత్సవం ఉద్దేశం ప్రశంసనీయమైనది మన దేశరక్షణకూ, సుస్థిరతకు కృషిచేస్తున్న వారిపట్ల ప్రేమ, ఆప్యాయత, అభిమానం చూపవలసిన విషయంలో అంతా పరిభవిస్తారు. దేశ స్వాతంత్ర్యం కొరకై తమ ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా వున్న వీరుల పట్ల మనం అభిమానం తప్పకుండా చూపవలసి వున్నది.

సాయుధ దళాలవారు మన దేశానికి కవచంగా వుండి దేశాన్ని కాపాడటమే కాకుండా వరదలు మొదలైన విపత్తులు సంభవించినప్పుడు సివిల్ అధికారులకు తోడ్పడుతూ జాతీయ ప్రజానీకానికి ఎంతో సేవచేస్తున్నారు. ఆ కారణంగా కూడా వారు మన అభిమానానికి అర్హులైవున్నారు.

సాయుధ దళాల వారి పట్ల మనం అభిమానం, ఆప్యాయత చూపడానికి పతాక దినోత్సవం బాలా మంచి అవకాశం మన సైనికులంటే ఎవరో కాదు. వారు మన దేశ పౌరులే. మన ప్రజల్లో నుంచి వచ్చినవారే. కనుక పతాక దినోత్సవం నాడు ఉదారంగా విరాళాలిచ్చి సైనికుల సంక్షేమానికి తోడ్పడవలసిందిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. అలా వారు ఉత్సాహంగా తోడ్పడతారని ఆశిస్తున్నాను.

చేర్యాల సమితి ఉపాధ్యాయ సంఘం

చేర్యాల, డిసెంబర్ 3

చేర్యాల సమితి ఉపాధ్యాయులు గత ఆదివారం నాడు శ్రీ యం. సత్యనారాయణరావు అధ్యక్షతన సమావేశమై సమితి సంఘానికి శ్రీయుతులు వి. వీరయ్య అధ్యక్షులు, బావురెడ్డి ఉపాధ్యక్షులు, పి. రాంరెడ్డి, వెంకటయ్యలు కార్యదర్శులు, యం. జాకబ్ కోశాధికారిని ఎన్నుకున్నారు.

25 వేల టన్నుల ముద్రణ కాగితం దిగుమతి

ప్రభుత్వ నిర్ణయం

న్యూఢిల్లీ, డిసెంబర్ 4

ముద్రణ కాగితాన్ని, రాయుకుందుకువాడే కాగితాన్ని ఎక్కువగా దిగుమతి చేసుకునే విషయంలో తగిన చర్యలను ప్రభుత్వ వ్యాపార సంస్థ తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగితం కొరత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోగినట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ మంత్రి ప్రకటన చేసింది.

రూపాయల నెల్లింపు సౌలభ్యం ఉన్న దేశాల నుంచి 25 వేల టన్నులు ముద్రణ, వ్రాత కాగితాన్ని ప్రభుత్వ వ్యాపార సంస్థ దిగుమతి చేసుకొన గలదని ఈ ప్రకటన వెల్లడించింది.

మూడవ ప్రణాళికలో వ్యవసాయ పరిశ్రమలు

రాష్ట్రంలో పథకాలు

హైద్రాబాద్, డిసెంబర్ 4

తృతీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో సహకార పద్ధతిన ఆరు పంచదార ఫ్యాక్టరీలు, ఇవిగాక విడిగా వేరే ఒక సిగరెట్టు ఫ్యాక్టరీ, రెండు పండ్ల పరిశ్రమాగారాలు, ఒక చిన్న తరహా ఎరువుల ఫ్యాక్టరీ ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడనున్నాయని తెలుస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో 1,76,600 యకరాలలో చెరుకు పంట సాగు అవుతుంది. చక్కెర ఫ్యాక్టరీలకు 100 లక్షలు, సిగరెట్ ఫ్యాక్టరీకి 100 లక్షలు, కొత్తగా నెలకొల్పే రెండు పండ్ల పరిశ్రమలకు కలిసి 20 లక్షలు కేటాయిస్తారని తెలుస్తోంది.

చిన్న తరహా ఎరువుల ఫ్యాక్టరీకి 150 లక్షలు కావలసనీ, అందులో సగం విదేశీ మారక ద్రవ్యం రూపంలో అవసరమనీ, ఈ చిన్న తరహా ఎరువుల ఫ్యాక్టరీలే ఏర్పడితే, ఒక్కొక్కదానిలో 10 వేల టన్నుల ఎరువులు ఉత్పత్తి అవుతుందని అంచనా. ఇలాంటి చిన్న ఎరువుల ఫ్యాక్టరీలను దేశంలో 12 నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వ కార్యనిర్వాహక బృందం వారు సూచించారట వరుకులు, కూరగాయలు, పండ్లు చెడిపోకుండా నిల్వ ఉంచే గిడ్డంగులకు 5 లక్షలు కేటాయిస్తారట.

ఇండియా పాకిస్తాన్‌ల మధ్య వస్తు మార్పిడి వ్యాపారం

ఒడంబడికపై కరాచీలో సంతకాలు

కరాచీ, డిసెంబర్ 4

ఇండియా – పాకిస్తాన్‌ల మధ్య వస్తు మార్పిడి పద్ధతిని వాణిజ్య ఒప్పందంపై నిన్న సంతకాలు జరిగాయి. (ఇందుకు సంబంధించిన తొలి వార్తను ''ఆంధ్ర జనత'' నిన్ననే ప్రచురించినది.) మూడు రోజుల చర్చల అనంతరం, చిట్టచివర దశలో ఒడంబడిక కుదరదనే సందేహం వేసిన క్షణాలు కూడా కొన్ని గడిచాయి. కాని చివరకు రెండు ప్రతినిధి వర్గాల ఒడంబడికకు సంబంధించిన అన్ని వివాదాంశాల పైన అంగీకారం కుదుర్చుకున్న ఫలితంగా ఒడంబడికపై సంతకాలు జరిగాయి.

దీని ప్రకారం ఇప్పుడు అమలులో వున్న మామూలు వ్యాపారం, వాటి జ్యాలకు తోడు, అదనంగా రెండు కోట్ల రూపాయల విలువ గల వ్యాపారం, వస్తు మార్పిడి పద్ధతిని ఉభయ దేశాల మధ్య జరుగుతుంది.

ఈ ఒడంబడిక ప్రకారం ఇండియా నుండి పాకిస్తాన్‌కు సిమెంటు, ఇంజనీరింగ్ సామాగ్రి, బీడీ ఆకులు ఎగుమతి అవుతాయి. ఆపేగార తోళ్లు, పదును చేసిన చర్మాలు కూడా పాకిస్తాన్ ఇండియా నుంచి దిగుమతి చేసుకుంటుంది.

పాకిస్తాన్ నుంచి ఇండియాకు ముడి పత్తి, కోళ్ళు, ఎగుమతి అవుతాయి. పండ్ల వ్యాపారం ఉభయ దేశాల మధ్య జరుగుతుంది.

ఇండియా తరఫున ఇండియా వాణిజ్య మంత్రిత్వ శాఖలోని జాయింట్ సెక్రటరీ ఖలన్నిని, పాకిస్తాన్ తరఫున పాకిస్తాన్ వాణిజ్య శాఖ సంయుక్త కార్యదర్శి ఖాన్ గారలు ఒడంబడిక త్రాలపై సంతకాలు చేశారు.

ప్రపంచ విద్యావేత్తల సమావేశం

ఈ నెలాఖరున ఢిల్లీలో

న్యూఢిల్లీ, డిసెంబర్ 4

ప్రపంచ విద్యావేత్తల వివిధ వార్షిక సమావేశం న్యూఢిల్లీలో డిసెంబర్ 31వ తేదీ నుండి జనవరి 6 వరకు జరుగుతుంది. ఈ సమావేశం భారత ప్రభుత్వ సహకారంతో జరుగుతున్నదనీ, దీనికి వివిధ దేశాల నుండి 600 మంది ప్రతినిధులు రానున్నారనీ, యూనివర్సిటీ విద్యా విధాన సంఘం అధ్యక్షులు అన్నారు. విద్యా విధాన వ్యాప్తికి గాంధీజీ తోడ్పడిన తీరు అనే విషయం యీ సమావేశంలో ప్రధానంగా చర్చకు వస్తుంది. సమావేశాన్ని ప్రధాని నెహ్రూ ప్రారంభిస్తారు.

బ్రిటిష్ నౌకలో ప్రమాదం

ఒక భారతీయుని మృతి

అడెన్, డిసెంబర్ 3

బ్రిటిష్ ఫ్రైటర్ [illegible] బ్యాంకులో ప్రమాదం వల్ల ఒక భారతీయ నావికుడు మరణించాడు. ఈ నావికుడు ఇంజనును శుభ్రపరుస్తుండగా బాగ జ్వాలలో చిక్కుకున్నాడు. ఇతనిని రక్షించడానికి వెళ్ళిన మరో ఇద్దరు నావికులు స్పృహతప్పి పడిపోయారు. వెంటనే నౌక అధికారి రక్షక సాధనలను ధరించి వీరి ముగ్గురినీ బైటకు తీసారు. వీరిని ఆస్పత్రికి తీసుకొని పోతుండగా భారతీయ కార్మికుడు మరణించాడు.

షిల్లాంగ్, డిసెంబర్ 4

అస్సాం సరిహద్దు సమీపంలో నేఫా సరిహద్దు ప్రాంతానికి షిల్లాంగ్‌తో నేడు టెలిఫోన్ సంబంధం ఏర్పరచబడింది.

ఆంధ్ర ప్రదేశ్ హైద్రాబాద్

యొక్క అనేక మంత్రులు, కార్యదర్శులు జడ్జీలు, యూనివర్సిటీలు, కమీషనర్లు, కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, మున్సిఫ్‌లు, మేజిస్ట్రేట్‌లు, సీల్దార్లు, సివిల్ సర్జన్‌లు, కంటి సర్జన్‌లు, మెడికల్ ఆఫీసర్లు, యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్లు, కాలేజీ ప్రొఫెసర్‌లు మరియు విద్యార్థులే,

కాక

దేశపు వ్యాపార వృత్తి గల వారు, మరి ఇతరులుకూడా.

డాక్టర్

ఎస్.ఎమ్. లుఖ్మాన్

(కంటి చికిత్సా ప్రవీణులు)

యొక్క అతిశయకర సేవా, అనుభవములను ప్రశంసించినవారు మీరును మీ కంటి యొక్క అశక్తతను పరీక్షించుకొనుటకు, పై డాక్టర్‌గారి సలహా పొందుటకు ఈ క్రింది అడ్రసుకు వచ్చి సంప్రదించ గలరు.

మేనేజర్ మోరిసన్ కార్ఖానా

హెడ్డాఫీస్

జనతా ఆప్టిష్యన్స్

టెలిఫోన్ నెం. 5141

మురళీధర్ బాగ్ లైన్,

నిజాంషాహీరోడ్.

బర్మామెల్ పెట్రోల్ పంపుఎదుట

బ్రాంచిఆఫీసు–పాత షోరూం

సుల్తాన్‌బజార్

ఫోన్ నెం: 5277

హైదరాబాద్ (ద).

6 వ దిగ్విజయ సంయుక్త వారం!

సారథి వారి

భాగ్య దేవత

సావిత్రి, రాజసులోచన, సూర్యకాంతం, జగ్గయ్య,

దీపక్ హైదరాబాద్ ప్యారడైజ్ సికిందరాబాద్

ఆటల సమయాలు: 2-30, 6-00, 9-30

శ్రీనివాస పిక్చర్ పాలెస్ వరంగల్

[Trupix] –నూతన యుగ రిలీజ్–

నేడు 2-30 గంటలకు మ్యాటినీతో బ్రహ్మాండమైన విడుదల!

ప్రత్యేక వినోదాన్ని, సంగీతాన్ని కలిగిన అసాధారణ సాంఘిక చిత్రం.....

విఠల్ ప్రొడక్షన్స్ వారి

*** పెళ్లి మీద పెళ్లి ***

తారాగణం:

కృష్ణకుమారి, రమణమూర్తి, చలం, మీనాకుమారి, మిక్కిలినేని,

ఏ. వి. సుబ్బారావు, పెరుమాళ్ళు, రమాదేవి

దర్శకుడు: బి. విఠలాచార్య

సాగర్ హైదరాబాద్ | రాజేశ్వర్ సికిందరాబాద్ | మార్కండేయ వరంగల్

(TRUPIX) -- ఎస్ ఇండియా రిలీజ్ --